RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 26 మార్చ్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:249

## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం..
## గంగారామ్ ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స



న్యూఢిల్లీ మార్చ్ 25 ;: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉన్నది. వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు చికిత్స కొనసాగిస్తున్నారు. ఆస్పత్రి వర్గాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10.22 నిమిషాలకు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని, డాక్టర్ల బృందం ఆమెను నిత్యం పర్యవేక్షిస్తున్నదని చైర్మెన్ డాక్టర్ అజయ్ స్వరూప్ తెలిపారు. కడుపు, మూత్రనాళంలో ఇన్‌ఫెక్షన్ ఉండి ఉంటుందని, దాని కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్లు చెప్పారు. చికిత్సలో భాగంగా ప్రస్తుతం యాంటీబయాటిక్స్ వాడుతున్నట్లు చెప్పారు. బహుశా వాతావరణం మార్పు వల్ల సోనియా గాంధీ అనారోగ్యానికి గురై ఉంటుందని కొన్ని వర్గాలు వెల్లడించాయి. అబ్జర్వేషన్ కోసం ఆమెను ఆస్పత్రిలో చేర్పించారమన్నారు. ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆమె కండీషన్ సీరియస్‌గా ఏమీలేదని డాక్టర్లు చెప్పారు.

## హార్ముజ్ జలసంధిని తెరిచిన ఇరాన్..
## షరతులతో నౌకలను అనుమతి..



న్యూ డిల్లీ మార్చ్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హార్ముజ్ జలసంధి మూసివేతతో ఇబ్బందులు పడుతున్న ప్రపంచ దేశాలకు ఊరటనిచ్చేలా ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అది పాక్షికంగానే. అందులోనూ నౌకల రవాణాకు అనేక షరతులు వర్తిస్తాయి. తమ శత్రుదేశాలతో సంబంధం లేని నౌకల్ని మాత్రమే ఈ జలసంధి నుంచి అనుమతిస్తామని ఇరాన్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ మ్యారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)కు ఇరాన్ ఒక లేఖ ద్వారా తెలిపింది.తమ శత్రుదేశాలతో సంబంధం లేని నౌకల్ని, తమ దేశ రక్షణ, భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఉంటే మాత్రమే అనుమతిస్తామని ఇరాన్ ప్రకటించింది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు ఇరాన్‌కు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి కార్యకలాపాలతో సంబంధం ఉండకూడదు. ఇరాన్‌తో కలిసి సమన్వయం చేసుకుని నౌకల్ని రవాణా చేసుకోవాలి. ఇక ఇజ్రాయెల్, అమెరికాలకు చెందిన ఎలాంటి నౌకల్ని ఇరాన్ ఈ జలసంధి మార్గంలో అనుమతించదు. మరోవైపు ఇప్పటికే ఈ మార్గం ద్వారా వెళ్లే నౌకల నుంచి ఇరాన్ పన్ను వసూలు చేయడం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ హార్ముజ్ జలసంధి మార్గంలో నౌకలు తక్కువ సంఖ్యలోనే కదులుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గాల్లో హార్ముజ్ జలసంధి ఒకటి. ఈ మార్గం ద్వారా సాగే రవాణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైంది.ప్రపంచంలో ఐదోవంతు చమురు ఈ మార్గం నుంచే రవాణా అవుతుంది. చమురుతోపాటు ఆహారం, మెటల్స్, పారిశ్రామిక ఉత్పత్తులు వంటివెన్నో ఈ మార్గం ద్వారా వెళ్తుంటాయి. అలాంటి మార్గం ఇప్పుడు స్తంభించిపోవడంతో రవాణా ఆగిపోయింది. దీంతో అనేక దేశాలు చమురు కొరత ఎదుర్కొంటున్నాయి. ఆహారం సంక్షోభం మొదలైంది. ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అందుకే ఈ మార్గం త్వరగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలని అనేక దేశాలు కోరుకుంటున్నాయి.

## గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక క్యాంపులను ఎత్తివేయాలి..

వార్తా 2 లో

# 99 రోజుల ప్రణాళికలో “2బిహెచ్‌కె”
# కేటాయింపులు పూర్తి చేస్తాం

### త్వరలో 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు
### జూన్ నాటికి మరో లక్ష పూర్తి
### పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లకు కార్యాచరణ
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ :- ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయడమేగాక, ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం నాడు సుమారు 22 మంది శాసనసభ్యులు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల తదితరల అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా త్వరలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు గాను కొద్ది రోజుల్లో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెస్తామని వీటి ద్వారా వచ్చే ప్రశ్నలకు 24 గంటల్లోగా సమాధానం చెప్పడమేగాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



మిగతా 2లో

# పెట్రోల్,డీజిల్ తో పాటు కొరత లేదు

### రాష్ట్రంలో సరిపడా ఇంధన నిలువలు
### ఏ ఒక్కరూ గందరగోళంలో పడకండి
### వదంతులతో ఆందోళన చెందకండి
### రాష్ట్ర ప్రజలకు మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్,ఎల్.పి.జి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రధానంగా హైదరాబాద్ లో డీజిల్,పెట్రోల్ బంక్ ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్,డీజిల్,ఎల్.పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఇంధన వనరులతో పాటు ఎల్.పి.జి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు గందరగోళంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి ఆయన మీడియాతో ముచ్చటించారు.

మిగతా 2లో

# మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో లోక్‌భవన్ ముట్టడి












**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**బుధవారంనాడు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ నిరసన మరియు రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ప్లకార్డులతో “M= నరేంద్ర -- Where is my Cylinder?µµ, »»Episten Puri -- Where is my Cylinder?” అనే నినాదాలతో లోక్ భవన్(రాజ్ భవన్) ఘెరావ్ చేపట్టారు.

మోడీ ప్రభుత్వ 12 సంవత్సరాల పాలనలో దేశ ఇంధన భద్రత పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. Narendra Modi నాయకత్వంలో భారీ ప్రచారాలు జరిగాయి కానీ ప్రాథమిక అవసరాల విషయంలో మాత్రం ఘోర వైఫల్యం బయటపడింది.

భారతదేశం LPGలో 60% వరకు దిగుమతులపై ఆధారపడుతుండగా, వ్యూహాత్మక నిల్వలు కేవలం 10--20 రోజులకే పరిమితం కావడం అత్యంత ప్రమాదకరం. అంతర్జాతీయ ఉద్రిక్తతలు వచ్చినప్పుడు దేశానికి సరఫరా నిలిచిపోతే ఎలా ఎదుర్కోవాలి అనే ప్రాథమిక ప్రణాళిక కూడా కనిపించడం లేదు. ఇది ప్రభుత్వ ముందుచూపు లోపానికి స్పష్టమైన ఉదాహరణ.

ఈ నిరసన ర్యాలీ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమై లోక్ భవన్ వరకు కొనసాగింది. సుమారు 800 మంది మహిళలు, కార్యకర్తలు ప్లేట్లు మరియు స్పూన్లు పట్టుకుని శబ్దాలతో నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వాన్ని మేల్కొల్పే ప్రయత్నం చేశారు.నిరసన అనంతరం గవర్నర్ కార్యాలయానికి ప్రతినిధి బృందం వెళ్లి సమస్యపై విజ్ఞప్తి పత్రం సమర్పించింది.ప్రజలపై భారంగా మారిన గ్యాస్ సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.ఈ కార్యాక్రమంలో ఎం.సునీతారావ్ ,ఉషశ్రీ, శ్రీకాంత్ యదవ్ , షా మెహమ్మద్ ఆరీఫ్,చంద్రమోహన్ యాదవ్ ,ఎస్.ధన్‌రాజ్,ఎం.శ్రీనివాస్, దాసరి రాజ్‌కుమార్, రాంబాబు గౌడ్ ,యోగీ ఖైరాతాబాదద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

ప్రజాబలం

26 మార్చ్ 2026 గురువారం

# బెంగాల్ గేమ్ ఛేంజర్ అవుతుందా

2021 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రభావం ఇప్పటికీ ఆ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై గట్టిగానే కనిపిస్తోంది. అయితే అది కేవలం గతం జ్ఞాపకంగా నిలిచిపోలేదు; 2026 ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అది మారుతూ, మరింత స్పష్టమైన సూచనగా కనిపిస్తోంది. ఒకప్పుడు అనేక పార్టీల మధ్య జరిగిన పోటీ, గత దశాబ్దంలో క్రమంగా కుదించుకుపోయి, ఇప్పుడు ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), భారతీయ జనతా పార్టీ (బిజెపి) మధ్య ద్విపాక్షిక పోరాటంగా మారింది. ఇదే సమయంలో వామపక్షాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, వాటి విజయాలు పరిమితంగానే ఉన్నాయి. ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఎవరు ముందుంటారు అనేది మాత్రమే కాదు; 2021లో ఏర్పడిన రాజకీయ సమతుల్యత స్థిరమా లేక సున్నితమైనదా అనేదే కీలకం. 2021 ఎన్నికల ఫలితం చూస్తే అది స్పష్టమైన విజయం. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి మూడింట రెండు వంతుకుపైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని, దాదాపు సగం ఓట్లను సంపాదించింది. అయితే ఆ విజయంలో ఒక ముఖ్యమైన మార్పు కూడా దాగి ఉంది. బిజెపి అట్టడుగు స్థాయినుంచి ఎదిగి, ఒక బలమైన ప్రతిపక్షంగా మారింది. దాదాపు ఐదో వంతులో రెండో వంతు ఓట్లను సంపాదించి, వామపక్ష, కాంగ్రెస్ కూటమిని పక్కకు నెట్టింది. ఈ మార్పు ప్రాధాన్యం చాలా గొప్పది. ఎన్నాళ్లుగా సిద్ధాంతపరమైన పోటీలు, వర్గాల పొత్తు రాజకీయాలతో సాగిన బెంగాల్ రాజకీయాలు, ఇప్పుడు రెండు వేర్వేరు రాజకీయ విధానాలను ప్రతిబింబించే పార్టీల మధ్య నేరుగా, స్పష్టమైన పోటీగా మారాయి. ఒకటి ప్రాంతీయ ఆధిపత్యం, సంక్షేమ కార్యక్రమాలపై ఆధారపడితే, మరొకటి జాతీయ ఏకీకరణ, గుర్తింపు రాజకీయాలపై దృష్టి పెట్టింది.ఐదేళ్లు గడిచిన తర్వాత కూడా, టిఎంసి ఆధిపత్యం ఎంతకాలం నిలబడుతుందన్నది. 'కొనసాగింపు, అలసట' అనే రెండు అంశాల మధ్య జరుగుతున్న సంక్లిష్ట సమతుల్యతపై ఆధారపడి ఉంది. పార్టీకి ఉన్న ప్రధాన బలం దాని బలమైన సంస్థాగత వ్యవస్థ, అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఓటర్ల విశ్వాసాన్ని సంపాదించే సామర్థ్యం. మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలను లక్ష్యంగా పెట్టుకున్న పథకాలు, స్థిరమైన సామాజిక మద్దతును ఏర్పరచాయి. ఇప్పటివరకు ఈ మద్దతు, ప్రభుత్వ వ్యతిరేక భావన, తీవ్రమైన రాజకీయ ప్రచారాలను కూడా తట్టుకుని నిలిచింది. అంతేకాదు, మమతా బెనర్జీ వ్యక్తిగత ప్రజాదరణ కూడా పార్టీకి కీలక బలం. ఆమె నాయకత్వం పార్టీ కథనాన్ని బలపరచడమే కాకుండా, అంతర్గత విభజనలను తగ్గించడంలో సహాయపడుతోంది.అయితే, అధికారంలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది. అవినీతి ఆరోపణలు, పార్టీలో వర్గపోరాటాలు, స్థానిక స్థాయిలో కార్యకర్తలలో ఉన్న అసహనం-- ఇవన్నీ కొన్ని ప్రాంతాల్లో వ్యతిరేక భావనకు దారితీశాయి. ఇవి తాత్కాలిక సమస్యలుగా కొట్టిపారేయలేనివి. ఈ బలహీనతలను టిఎంసి నాయకత్వం గుర్తించినట్లే కనిపిస్తోంది. అందుకే అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేయడం, కొత్త తరాన్ని ముందుకు తీసుకురావడం వంటి చర్యలను చేపడుతోంది. అయితే ఇవి ఎంతవరకు ప్రభుత్వ వ్యతిరేక భావనను తగ్గిస్తాయన్నది కీలక అంశంగా మారనుంది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో పార్టీ ప్రదర్శన, దాని స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, అత్యంత కీలకమైన అసెంబ్లీ పోటీలో పార్టీ పట్టు కోల్పోయే అవకాశాన్ని ఇవి పూర్తి తొలగించలేవు. బెంగాల్‌లో పార్టీ విస్తరణ ఇప్పటికే రాష్ట్ర రాజకీయ సమీకరణలను మార్చేసింది. అయితే 2021 తర్వాత దాని ప్రస్థానం, పురోగతి కంటే ఎక్కువగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికే పరిమితమైంది. ఉత్తర బెంగాల్ ప్రాంతాల్లో, అలాగే గుర్తింపు రాజకీయాలు, పాలనపై పార్టీ ఇచ్చిన సందేశాలకు స్పందించిన వర్గాల్లో బిజెపికి గట్టి ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ, ఓట్ల వాటాకు, సీట్ల మార్పిడికి మధ్య ఉన్న అంతరం ఒక కీలకమైన అడ్డంకిగా మిగిలిపోయింది. 'ఫస్ట్ -పాస్ట్ -ది- పోస్ట్' విధానం సంస్థాగత బలహీనతలను మరింత స్పష్టంగా బయటపెడుతోంది. ఈ విషయంలో బిజెపి, టిఎంసిలో పాతుకుపోయిన క్షేత్రస్థాయి యంత్రాంగం కంటే వెనుకబడి ఉంది. బిజెపి ఎదుగుదలకు మరో ముఖ్యమైన అడ్డంకి నాయకత్వ సమస్య. జాతీయ స్థాయి నాయకులు పార్టీకి గుర్తింపు, ఉత్సాహం తీసుకువచ్చినా, మమతా బెనర్జీకి సమానంగా రాష్ట్రస్థాయిలో ప్రభావం చూపగల నాయకుడు లేకపోవడం పార్టీకి పెద్దలోటుగా మారింది. బెంగాల్ రాజకీయాల్లో ఎప్పటినుంచో ప్రాంతీయ భావజాలం, వ్యక్తిగత నాయకత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అయితే బిజెపి ప్రధానంగా కేంద్రస్థాయి కథనాలపై ఆధారపడటం వల్ల, అవి స్థానిక స్థాయిలో పూర్తిగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ లోటును పూడ్చాలంటే, పార్టీకి కేవలం ఓట్ల శాతం పెరగడమే కాకుండా, మరింత సమర్థవంతమైన సంస్థాగత నిర్మాణం, స్పష్టమైన రాష్ట్రస్థాయి నాయకత్వ వ్యూహం అవసరం. ఇక వామపక్షాల పరిస్థితి చూస్తే, అది చారిత్రక పతనాన్నీ, తాత్కాలిక పట్టుదలనూ ప్రతిబింబిస్తోంది. మూడు దశాబ్దాలపాటు ఏకపక్ష ఆధిపత్యం చూపిన వామపక్షాలు, ఇప్పుడు శాసనసభలో దాదాపు కనిపించని స్థితికి చేరాయి. 2021లో వారి సంప్రదాయ మద్దతుదారులు బిజెపి వైపు మళ్లడం, బిజెపి సిద్ధాంతానికి మద్దతు పలకడం కంటే, టిఎంసిని ఓడించాలనే వ్యూహాత్మక నిర్ణయాన్ని ఎక్కువగా భావించాలి. అయితే ఈ విధమైన వ్యూహాత్మక ఓటింగ్ వల్ల ప్రస్తుతం రాజకీయాలు రెండు పార్టీల మధ్యే కేంద్రీకృతమయ్యే పరిస్థితి మరింత బలపడింది. ఇదే పరిస్థితి వామపక్షాల పునరుద్ధరణకు అడ్డంకిగా మారుతోంది. అయినప్పటికీ, వామపక్షాల ఉనికి కొంతమేర మిగిలి ఉంది అనేందుకు ఆధారాలు ఉన్నాయి. ముఖ్యంగా యువతలో, అలాగే పట్టణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో కొంత మద్దతు కనిపిస్తోంది. చిన్న పోటీల్లో ఓట్ల శాతం క్రమంగా పెరగడం, పడిపోతున్న స్థితి కొంతవరకు స్థిరపడిందని సూచిస్తున్నప్పటికీ, దాని పునరుజ్జీవనానికి ఉన్న నిర్మాణాత్మక అడ్డంకులు మాత్రం చాలా బలంగా ఉన్నాయి. తీవ్రంగా విభజన చెందిన రాజకీయాల్లో, గెలిచే అవకాశాలు లేవని భావించే మూడో పార్టీకి ఓటేయడానికి ప్రజలు సాధారణంగా ముందుకురారు. బలమైన నాయకత్వం లేదా కొత్త రాజకీయ దిశ లేకపోతే, వామపక్షాలు అధికారానికి కాకుండా, కేవలం తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోవడానికే పరిమితమయ్యే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. రాబోయే ఎన్నికలను మరింత అనిశ్చితంగా మారుస్తోన్న ప్రధాన అంశం స్వల్ప తేడాతో నిర్ణయించబడే నియోజకవర్గాల ప్రాధాన్యం. 2021లో గణనీయమైన సంఖ్యలో స్థానాలు చాలా తక్కువ ఓట్ల తేడాతోనే నిర్ణయించబడ్డాయి. అంటే, ఓటర్ల ప్రాధాన్యతల్లో చిన్న మార్పు వచ్చినా, సీట్ల ఫలితాల్లో అసమానమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఒకవైపు రెండు పార్టీల మధ్య స్థిరమైన పోటీ ఉన్నప్పటికీ, మరోవైపు అనిశ్చితిని కూడా పెంచుతోంది. ప్రాంతాల వారీగా చూస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. బెంగాల్ ఉత్తర జిల్లాల్లో బిజెపికి బలమైన స్థానం ఏర్పడగా, దక్షిణ ప్రాంతాల్లో టిఎంసి తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఈ భౌగోళిక విభజనను రెండు పార్టీలూ తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయనున్నాయి. మరింత లోతుగా చూస్తే, ఈ పోటీ పరిపాలన, సంక్షేమం అనే పరస్పర విరుద్ధమైన కథనాల చుట్టూ తిరిగే అవకాశం ఉంది.

# 99 రోజుల ప్రణాళికలో "2బిహెచ్‌కె" కేటాయింపులు పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మూడు విభాగాలుగా సమస్యలను విభజించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 21లక్షల ఇండ్లు నిర్మించారని తెలిపారు. మళ్లీ ఈ పేదల ప్రభుత్వంలోనే పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సాగుతోందని అన్నారు. గత ప్రభుత్వం రెండు లక్షల పైచిలుకు ఇండ్లను మంజూరు చేసి హైదరాబాద్ ప్రాంతానికి లక్ష ఇండ్లను కేటాయించగా వీటిలో 78,861 ఇండ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని, 21, 838 ఇండ్లు కేవలం పునాదులకే పరిమితమయ్యాయని తెలిపారు.

జిహెచ్‌ఎంసీ పరిధిలో 26 కాలనీలు అసంపూర్తిగా ఉండిపోయాయని, తాము కొత్తగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేశామని వివరిస్తూ 738 కోట్ల రూపాయిలతో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. తాము ఎటువంటి భేషజాలకు పోకుండా గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 92వేల ఇళ్లలో 62వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు.

2023 ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం 23,500 ఇండ్లను కేటాయించిందని అయితే నగరంలో వృత్తి వ్యాపారాలు చేసుకునే వారు సమారు 20-30 కిలోమీటర్ల దూరంలో కేటాయించిన ఇండ్లలోకి రాలేదని ఫలితంగా 12వేలకు పైగా ఇండ్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మూడు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు. లబ్ధిదారులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు నెలల్లోగా వీటిలో గృహప్రవేశాలు చేయాలని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఒకవేళ వారు రాలేక పోతే సుమారు 5-10 కిలోమీటర్ల పరిధిలో ఉండే అర్హులైన పేదలకు కేటాయించేందుకు నిర్ణయించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొత్త కేటాయింపులు పూర్తి చేస్తామని సభకు తెలిపారు. 2017లో చేపట్టిన కాలనీలకు మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో రూపొందించిన ఎస్టిమేషన్లు రద్దుచేస్తూ జీవో ఇచ్చామని, అదేవిధంగా జర్నలిస్టుల కాలనీలకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 80 కాలనీలకు మౌలిక సదుపాయాల కోసం 784 కోట్లు మంజూరు చేశామని, వీటిలో సుమారు 432 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని ,మిగిలిన మొత్తంతో పాటు మరో 270 కోట్ల రూపాయిల వరకు అవసరం ఉంటుందని భావిస్తున్నామని అన్నారు.

రాష్ట్రంలో తొలివిడత 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ ప్రత్యేకంగా చెంచులకు, ఐటిడిఎ పరిధిలో గిరిజనులకు 12వేల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వివిధ కాలనీల్లో షాపులకు సంబంధించి లీజుకు ఇస్తే వారు సక్రమంగా అద్దెలు చెల్లించడం లేదని, పైగా కోర్టులకు వెళు ్తన్నందన అద్దెలు వసూలు కావడం లేదని ఈ పరిస్థితుల్లో సదరు షాపులను బహిరంగ వేలంలో విక్రయించి వచ్చిన డబ్బును ఆయా కాలనీ కమిటీ, ప్రభుత్వం పేరిట జమచేసి వాటిపై వచ్చే వడ్డీతో విద్యుత్, లిఫ్ట్ తదితర అవసరాలుకు ఖర్చు చేసేలా ప్రతిపాదించామని తెలిపారు.

గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, ఇంతవరకు కేటాయించని ఇండ్లకు సంబంధించి పాత కాంట్రాక్టర్లు అప్పటి రేటుకు సమ్మతిస్తే వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు. ఈ 99 రోజులు ప్రణాళికా కార్యక్రమంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేస్తామని , గతంలో నిర్మాణాలు చేపట్టి ఆపివేసిన లబ్ధిదారులకు మిగిలిన నిర్మాణాలకు గాను నిధులు విడుదల చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షునిగా ఉంటారని, ఆయన ఆధ్వర్యంలోని కమిటీ నిరుపేదలను ఎంపిక చేస్తే కలెక్టర్ పరిశీలన, అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో కేటాయింపులు జరుగుతాయని, రానున్న కాలంలో ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించేలా పరిశీలిస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో ఈ మార్చి 31నాటికి సుమారు లక్షా 12వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు జరుగనున్నాయని, వచ్చే జూన్ నాటికి మరో లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి పొంగులేటి ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా ఆగిపోయిన ఇండ్లకు నిధులు ఇస్తామని దీనిపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలిపారు.

జిహెచ్‌ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి గాను ఇప్పటికే 14-15 స్థలాలను గుర్తించామని , ఆయా ప్రాంతాలలోని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని , రాష్ట్రంలోని ఇతర ముఖ్యపట్టణాలలో కూడా ఇదే పద్ధతిని అమలు చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# పెట్రోల్,డీజిల్ తో పాటు కొరత లేదు

మొదటి పేజీ తరువాయి

రానున్న మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని జరుగుతున్న వదంతులతో ఏ ఒక్కరూ అయోమయంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నారు.డిమాండ్ నీ మించి సరఫరా కొనసాగుతోందని,ఈ రోజు 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.అంటే 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు.దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.

వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతో రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25% పెరిగినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగ కుండా అదనంగా 22% అందుబాటులో ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు.అయితే కొన్ని పెట్రోలు బంక్ లకు నిర్ణీత సమయానికి ట్యంకర్లు చెరుకోక పోవడంతో ఆయా బంక్ లలో నో-స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. వాస్తవంగా మాత్రం ఎంత మాత్రం కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు. అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో,డబ్బాలలో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంతకుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పెట్రోలియం నిలువలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని,సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొనసాగేందుకు వీలుగా ఓ జీ సీ లైన్ ను విస్తరించినట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంక్ లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని,హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలో ఎక్కడ కుడా కొరత లేదని. అహ్మదాబాద్, సూరత్,బెంగుళూరు,ధారవాడ ,బెల్గాం వంటి నగరాలలో కూడ ఇదే పరిస్థితి ఉత్పన్నమయ్యాయన్నారు.

ఎల్.పి.జి విషయంలో ఎటువంటి కొరత లేదని,కాకపోతే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించమన్నారు.ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

పెట్రోల్,డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉందని,ప్రజలేవరు అయోమయానికి గురి కావొద్దని,వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక క్యాంపులను ఎత్తివేయాలి..

**నౌక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిపై పూర్తి హక్కు కలిగి ఉండాలి**

**యుద్ధం వల్ల తమకు కలిగిన నష్టానికి పరిహారాన్ని చెల్లించాలి**

**తమ ప్రతిపాదనలకు అంగీకరిస్తే అమెరికాతో చర్చలు జరుపుతాం: ఇరాన్**



న్యూ డిల్లీ మార్చ్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇరాన్‌తో శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆచితూచి స్పందిస్తోంది. ముందుగా చర్చల ప్రసక్తే లేదని తేల్చిన ఇరాన్, ఇప్పుడు మాత్రం స్వరం మార్చింది. తమ ప్రతిపాదనలకు అంగీకరిస్తే అమెరికాతో చర్చలు జరుపుతామని ప్రకటించింది. ఈ మేరకు అమెరికాకు కీలక ప్రతిపాదనలు చేసింది. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక క్యాంపులను ఎత్తివేయడం అన్నింటికంటే కీలకమైన షరతు. అలాగే, ఇరాన్‌పై ఉన్న ఆంక్షల్ని ఎత్తివేయడంతోపాటు నౌక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిపై పూర్తి హక్కు కలిగి ఉండాలి.అలాగే, యుద్ధం వల్ల తమకు కలిగిన నష్టానికి పరిహారాన్ని కూడా ఇరాన్ కోరింది. దీంతోపాటు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కూడా ఇజ్రాయెల్ డిమాండ్ చేసింది. హోర్ముజ్ జలసంధి నుంచి రవాణా చేసే నౌకలపై పన్ను వసూలు చేస్తారు. దీనికి సంబంధించి పూర్తి ఆధిపత్యం తమకు దక్కాలని ఇరాన్ కోరుతోంది. ఇకపై ఈ ప్రాంతంలో తిరిగి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చూస్తామని అమెరికా హామీ ఇవ్వాలి. ఇలాంటి అనేక డిమాండ్లను ఇరాన్.. అమెరికా ముందుంచింది. వీటితోపాటు కొన్ని అంశాల విషయంలో ఇరాన్ పట్టువీడినట్లు తెలుస్తోంది. ఐదేళ్లపాటు బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని నిలిపివేస్తామని తెలిపింది. అలాగే, యురేనియం నిల్వల్ని కూడా తగ్గించుకునేందుకు అంగీకరించింది. ఇరాన్‌లోని అణ్వాయుధాలు, యురేనియంపై అంతర్జాతీయ సంస్థల తనిఖీకి కూడా అంగీకరించింది.మరోవైపు తీవ్రవాద నిర్మూలనలో కూడా పాలుపంచుకునేందుకు ముందుకొచ్చింది. దీనిలో భాగంగా ఇరాన్ సమీపంలోని దేశాల్లో ఉండే హెజ్బొల్లా, హమాస్, ఇరాకి మిలీషియాస్ వంటి తీవ్రవాద సంస్థలకు నిధులు అందించడం నిలిపివేస్తామని కూడా తెలిపింది. అయితే, ఈ అంశాలన్నింటిపై అధికారిక ప్రకటన రాలేదు. కానీ, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తుల ద్వారా సందేశం పంపినట్లు తెలుస్తోంది. అమెరికా చర్చల ప్రతిపాదనను ఇరాన్ తప్పుబడుతోంది. అమెరికా తనతో తానే చర్చించుకుంటోంది అని ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఎబ్రహిమ్ అన్నారు. అమెరికా కూడా ఇరాన్‌కు 15 అంశాలతో శాంతి ప్రణాళిక ప్రతిపాదించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య చర్చలపై ఇంకా ఎలాంటి ముందడుగు పడలేదు.

# పెట్రోల్ టెన్షన్ వద్దు హైదరాబాద్‌లో 60 రోజులకు సరిపడా నిల్వలు: సీపీ సజ్జనర్



హైదరాబాద్ సీపీ సజ్జనార్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నగరంలో ఇంధన కొరత ఏర్పడనుందనే వార్తలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పందిస్తూ..నగరంలో ఇంధన కొరత ఉందనే వార్తలు పూర్తిగా అవాస్తవమని, అవి కేవలం పుకార్లు మాత్రమేనని స్పష్టం చేశారు.60 రోజులకు సరిపడా నిల్వలు: నగర ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీపీ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో రాబోయే 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 22న 3,024 ఐఒ ఇంధన విక్రయాలు జరగగా, వదంతుల కారణంగా 23వ వ నాటికి అవి ఏకంగా 6,400 ఐఒకి పెరిగాయి. ఒకేసారి ప్రజలందరూ బంకులకు వచ్చి ఫుల్ ట్యాంకులు చేయించుకోవడం వల్ల ఏర్పడిన అత్యధిక డిమాండ్ కారణంగానే కొన్ని చోట్ల తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయని ఆయన వివరించారు.ఇంధన సరఫరా వ్యవస్థ నిరాటంకంగా కొనసాగుతోందని, ఆయిల్ కంపెనీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని సీపీ తెలిపారు. అయితే, బాటిళ్లు మరియు డబ్బాల్లో లూజ్ ఇంధనాన్ని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై పోలీసుల నిఘా ఉంటుందని సజ్జనర్ పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా ఉన్న 240 పెట్రోల్ బంకులపై పోలీసులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు శాంతంగా ఉండాలని, అనవసరంగా ఫుల్ ట్యాంకులు చేయించుకుని సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెంచవద్దని ఈ సందర్భంగా సీపీ విజ్ఞప్తి చేశారు.

# సభ జరుగుతున్న తీరు అస్సలు భాలేదు హరీష్ రావు



BC, SC , ST ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది అనడానికి ఇదే నిదర్శనం.

98 శాతం BC SC ST నిధులు పక్కదారి మళ్ళించారు.

BC, SC , ST లకు కేటాయించిన నిధులను 2 శాతం మాత్రమే ఈ ప్రభుత్వం ఖర్చు చేసింది.

అసెంబ్లీ నడిపించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది.

అసెంబ్లీ సభా నియమాలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు.

చనిపోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు చెక్ ఇచ్చేందుకు 3 గంటలు సభను వాయిదా వేశారు.

ప్రతి రోజు జీరో అవర్ తీసుకుంటామని చెప్పి , రెండు రోజుల నుంచి

జీరో అవర్ తీసుకోవడం లేదు.

ప్రజల సమస్యల పై అసెంబ్లీలో చర్చ

తల క్రింద పెట్టీ కాలు పైకి పెట్టిన రేవంత్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కాలేదు.

ఎన్నికలు ఎప్పుడు జరిగిన గెలిచేది బిఆర్ఎస్, ముఖ్యమంత్రి కేసీఆర్.

చిన్న చూపు ఉంది, ఇదే విషయాన్ని బిఆర్ఎస్ మొదటి నుంచి చెప్తూనే ఉంది.

సౌత్ ఇండియాకు కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్స్ తక్కువగా వస్తున్నాయి.

డిలీమిటేషన్ ను స్వాగతిస్తున్నాము, అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగడం వల్ల బిఆర్ఎస్ పార్టీకి లాభమే.

ఏ టైంలో గోల్ కొట్టాలో బిఆర్ఎస్ కు భాగ తెలుసు.

బిఆర్ఎస్ తప్పకుండా గోల్ కొడుతుంది, బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం. కేసీఆర్ ముఖ్యమంత్రి అవడం ఖాయం.

ఎవరో ఎందుకు సిద్దిపేటలో రేవంత్ రెడ్డినే రమ్మనండి.

ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు కాబట్టే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చెవులో పూలు పెట్టుకోని నిరసన తెలియజేశాము.

ఆరు గ్యారెంటీలు అమలు చేసి ఉంటే కాంగ్రెస్ పార్టీని అభినందించే వాళ్ళం కదా.

ఇంకో వారం రోజుల పాటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను పొడిగించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది.

అన్ని అంశాల పై చర్చ జరగాలంటే మరో వారం రోజుల పాటు అసెంబ్లీ జరగాలి.

సభ జరుగుతున్న తీరు అస్సలు భాలేదు.

ఈరోజు రెండు ముఖ్యమైన ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని కేటీఆర్ అడిగిన ప్రశ్నకు.

16 నోటిఫికేషన్ లు, 16, 978 ఉద్యోగాలు ఇచ్చామని ప్రభుత్వం సమాధానం చెప్పింది.

బిఆర్ఎస్ హయంలో ఇచ్చిన ఉద్యోగాలు 50,785 మందికి నియామక పత్రాలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకుంటుంది.

ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసింది , నిరుద్యోగులను మోసం చేశారు.

వెల్ఫేర్ బోర్డ్స్ కార్పొరేషన్ లకు పై స్పష్టత ఇవ్వాలని నేను ప్రభుత్వాన్ని ప్రశ్నించాను.

33 కార్పొరేషన్ లకు , 16 కార్పొరేషన్ లకే కార్యాలయాలు ఉన్నాయి అని సమాధానం ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రజక ఫెడరేషన్ కు 386 కోట్లు పెట్టీ , 1 కోటి ఖర్చు చేసినట్లు సమాధానం చెప్పారు.

నాయి బ్రాహ్మణలకు

280 కోట్లు పెట్టీ , 30 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు.

మున్నూరు కాపులకు 100 కోట్లు కేటాయించి , ఒక్క రూపాయి ఖర్చు చెయ్యలేదు.

కృష్ణ బలిజ ( పూసల ) 100 కోట్లు కేటాయించి, ఒక్క రూపాయి ఖర్చు చెయ్యలేదు.

ఆర్యవైశ్యలకు 25 కోట్లు కేటాయించి, ఒక్క రూపాయి ఖర్చు చెయ్యలేదు .

BC కార్పోరేషన్ కు 1, 370 కోట్లు పెట్టీ , 6 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

ST కార్పోరేషన్ కు 2,730 కోట్లు పెట్టీ , 52 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

SC కార్పోరేషన్ కు 5,403 కోట్లు పెట్టీ , 74 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

## అంగన్వాడి స్కూల్లో గర్భిణీలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన ముఖ్యఅతిథిగా పాల్గొన్న 14 వార్డు కౌన్సిలర్ తూమ్ మధు



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ మార్చి -25** వేములవాడ పట్టణంలోని 14వ వార్డు న్యూ అర్బన్ కాలనీలోని అంగన్వాడీ సెంటర్ 2లో ఐసిడిఎస్ సీడీపీఓ సౌందర్య, సూపర్వైజర్ అంజమ్మ ఆదేశాల మేరకు గర్భిణీలకు శ్రీమంతం 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వార్డు కౌన్సిలర్ తూమ్ మధును అంగన్వాడి టీచర్ దాసారపు శారద శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పిల్లలకు కౌన్సిలర్ పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ పరుశురాం, ఆర్పి రేణుక అంగన్వాడి పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మియాపూర్ అనుమతి లేకుండా అపార్ట్మెంట్ నిర్మాణం... జరుగు తోంది జిహెచ్ఎంసి అధికారులు ఏం చేస్తున్నారు.



**ప్రజాబలం ,మార్చి 25 శేర్లింగంపల్లి ప్రతినిధి నరేష్** లిశేరిలింగంపల్లి నియోజక వర్గం పరి ధిలోని గోకుల్ ప్లాట్స్ వెంకటరమ ణ కాలనీలో ప్లాట్ నెంబర్ 1148, 1149 ప్లాట్ లలో నిబంధనలకు విరుద్ధంగా జింప్లస్ 8 అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని స్థాని కులు ఆరోపిస్తున్నారు దీనిపై ఇప్ప టికి పోలీస్ స్టేషన్ ప్రజావాణి హైడ్రా ధికారు ఫిర్యాదు చేసిన ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చే స్తున్నారు. నిరుపేదలు చిన్న గుడి చివేసిన కూచివేయడానికి ఆగమే ఘూల మీద దూసుకు వచ్చే టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ విషయం లో నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవ హరించడం తగదని ఈ ప్రాంతవా సులు వారి తీరుపై మండిపడుతు న్నారు. గత ఏడాది నుండి ఇప్పటి వరకు ఇలాంటి అనుమ తులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలు ఎన్నో ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ సంబంధించిన అధికారులు వారికి కావలసిన ముడుపులని తీసుకొని ప్రభుత్వానికి రావలసిన పెద్ద ఎత్తు న గండి కొడుతున్నారని సందేహం లేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.ఇప్పటికైనా ఈ భారీ నిర్మాణం వల్ల రహదారి సమ స్య లు తలెత్తుతున్నాయని నిబం ధన ఉల్లంఘించిన వారిపై తక్షణ మే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత నివాసితులు కోరుతు న్నారు.

## నరసరావుపేట పోలీసుల వేట.. పోలీసుల అదుపులో బైక్ స్టంట్స్ చేసిన యువకులు

నరసారావుపేట నరసరావుపేటలో బైక్ స్టంట్స్ చేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న యువకులపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నరసరావుపేట రూరల్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, స్టంట్స్ చేస్తున్న పలువురు యువకులను గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టంట్స్కు ఉపయోగించిన బైకులను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న యువకుల తల్లిదండ్రులను పిలిపించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదకరంగా బైక్ స్టంట్స్ చేసే వారిపై కఠినంగా చర్యలు కొనసాగుతాయని నరసరావుపేట రూరల్ సీఐ ఎం.వి. సుబ్బారావు తెలిపారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ రాజీతో కేసులను పరిష్కరించుకోండి. ,జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చ్- 24 (ప్రజాబలం ప్రతినిధి)** ఈనెల 28వ తేదీ శనివారం రోజున నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఈలోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ వివాదాలు,ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. జుడీషియల్ శాఖ అందించిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇరుపక్షాలు శాంతియుత పరిష్కారం పొందాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు, ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు. కాబట్టి తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## వైభవంగా రాజన్న ఆలయంలో 7 వ రోజు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలు







**ప్రజాబలం ప్రతినిధి వేములాడ మార్చి -25** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 7వ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల స్వామివారికి పంచోపనిషత్తు విధానంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ రామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు ఘనంగా నిర్వహించారు. దానితో పాటు పుణ్యవచనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ వంటి యాగశాల కార్యక్రమాలు నిర్వహించారు చేశారు. శ్రీ సీతా చంద్ర శ్రీరాముని నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరింగంటి విజయసారథి--కర్ణ దంపతులు పాల్గొనగా, వేద పండితులు ఆచార్యులుగా వ్యవహరించారు.

## సీతారామకళ్యాణోత్సవానికి ఏర్పాట్లను పరిశీలించిన రాజన్న ఆలయ ఈవో



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ఏర్పాట్లలో భాగంగా కళ్యాణం జరగనున్న వేదిక, చలవ పందిళ్ళు, ఎల్‌సీడీ స్క్రీన్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, అన్నప్రసాదం పంపిణీ చేసే ప్రదేశం, కళ్యాణం అనంతరం ఓడి బియ్యం సమర్పించి దర్శనానికి వెళ్లే మార్గం వంటి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే భక్తులు వేదిక ముందు కూర్చునేలా ఏర్పాటు చేసిన సెక్టార్లు, త్రాగునీటి సదుపాయం, శానిటేషన్, బారికేడ్లు, ప్రవేశ ద్వారాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈఓతోపాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్ కు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఘన సన్మానం



హైదరాబాద్ మార్చ్ 25 ;తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలలో , రెండవ విడత సీఎం కప్ పోటీల నిర్వహణలో విశిష్ట సేవలు అందజేసిన స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్ ను సన్మానిస్తున్న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పద్మభూషణ్, ఒలంపియన్ సైనా నెహ్వాల్ మరియు ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎంతమందిని తొక్కుతవ్ నువ్వు..

## పార్టీ ఫిరాయింపులు మంచిది కాదని చెప్పినా వినిపించుకోలేదని..
## జగిత్యాలలో ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినా వినలేదు
## రేవంత్ రెడ్డిని ఎదిరించి పోరాటం చేస్తా : జీవన్ రెడ్డి
## పార్టీ కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల



హైదరాబాద్ మార్చ్ 25 ;కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. పార్టీ కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా తన అనుచరులు, మద్దతు దారులతో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులు మంచిది కాదని చెప్పినా వినిపించుకోలేదని.. జగిత్యాలలో ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినా వినలేదని వాపోయారు. సికింద్రాబాద్ ఇంటలెక్చువల్ కానిస్టుయెన్సీయా..? దానం నాగేందర్‌ను అభ్యర్థిగా పెట్టదలచుకుంటే ఆయనను అసెంబ్లీకి రాజీనామా చేయించి పెడితే అయిపోతుండె కదా. ఒక ఎమ్మెల్యే ఒక రాజకీయ పార్టీ గుర్తుతో పోటీ చేసి రాజీనామా చేయకుండా అదే గుర్తింపుతో కొనసాగుతూ కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేయడమనేది దేనికి సంకేతమని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ సికింద్రాబాద్ సీటును కోల్పోయింది. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలతో సీఎం సొంత పార్లమెంట్ మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. చేవెళ్ల ఎంపీ స్థానానికి తొలుత సునీతా మహేందర్ రెడ్డిని అభ్యర్థిగా నిర్ణయించి.. తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుండి రంజిత్ రెడ్డిని తెచ్చి అతనికి ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలతో సొంత పార్లమెంట్ స్థానం మహబూబ్ నగర్ చేవెళ్ల, సికింద్రాబాద్ సీట్లు కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్నారు.

ఎదిరించి పోరాడితే పోయేదేముంది..

రేవంత్ రెడ్డిని కూడా ఎదిరించి పోరాటం చేస్తానంటున్న. నీతో అణగదొక్కబడే దానికంటే ఎదిరించి పోరాడితే పోయేదేముంది. మనకు పోయేదేముంది. పోరాడదామా.. వద్దా..? మరిక్కడే అణగదొక్కబడదామా.. ఎంతకాలం ఈ అవమానాలు.. ఎంత కాలం ఈ మానసిక క్షోభ.. అంటే కాంగ్రెస్ పార్టీలో ఇంకెవడు ఎదగొద్దు. నీ చెప్పు చేతల్లో ఉండేటోడు. నీ దయాదాక్షిణ్యాలకు లొంగేటోడు. నీ అడుగులకు మడుగులొత్తేటోడు.. వాడు మాత్రమే కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలే. నిన్ను ఎదురించేటోడు రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచేటోడిని నువ్వు అణగదొక్కుతున్నవంటున్నా నేను. ఈ రెండున్నర సంవత్సరాలు నేను పదవి అడగలేదు. ప్రభుత్వ సలహాదారు అడగలే.. కార్పోరేట్ చైర్మన్ అడగలే. నాకు అర్హత లేకనా..?

వేం నరేందర్ రెడ్డి ఎవడు..ఆయన పార్టీకి చేసిన సేవ ఏంది..? అని ప్రశ్నించారు. నాకు అర్హత లేకనా..? పోచారం శ్రీనివాస రెడ్డి బతుకచ్చినోడు వాడికేమో ప్రభుత్వ సలహాదారు ఇచ్చినవ్.. వాడు ఎవడయా..? ఈ 20 మాసాల్లో పోచారం ప్రభుత్వానికి ఇచ్చిన సలహాలేంటో చెప్పాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో ఏం సలహాలు ఇచ్చావ్ నువ్వు.. పోచారంను అడిగారు. నీ అడుగులకు మడుగులు ఎవడైతే ఒత్తుతడో వాడికి పదవులు అని అన్నారు. ముఖ్యమంత్రి ఈ పార్టీ నాది.. నాకెవడైనా ఎవడైనా అడ్డమొస్తే తొక్కుతా అని అంటున్నడు.. ఎంతమందిని తొక్కుతవ్ నువ్వు.. అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. ఇవాళ చెప్తున్న నేను నీ తొక్కుడు కాదు.. జగిత్యాల నియోజకవర్గం నినదించిన నాడు.. అడ్డుపడ్డ నాడు ఏ శక్తి కూడా మమ్మల్ని ఆపలేదని హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతున్న ఉగ్ర లింకులు
## విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్టు చేయగా..
## హైదరాబాద్ లో సయిదా బేగంను ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు



హైదరాబాద్ మార్చ్ 25 తెలుగు రాష్ట్రాల్లో ఉగ్ర లింకులు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్టు చేయగా.. తాజాగా వారిని ఉగ్రవాదం వైపు ప్రోత్సహించిన హైదరాబాద్‌కు చెందిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విచారణ నిమిత్తం ఆమెను విజయవాడకు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ సూచనలతో సయిదా బేగం పనిచేస్తుంది. ఈ క్రమంలోనే విజయవాడకు చెందని సోహైల్ బెగ్, షరీఫ్, డానిష్ యువకులను తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో ఆమె కీలక పాత్ర పోషించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో ఇంధన కొరత ఉందని తప్పుడు వార్తలు నమ్మొద్దు
## తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్



హైదరాబాద్ మార్చ్ 25 : తెలంగాణలో ఇంధన కొరత ఉందని తప్పుడు వార్తలు నమ్మొద్దని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేశారు. అవాస్తవ ప్రచారాల వల్ల ప్రజలు అనవసరంగా బంకుల వద్ద క్యూ కడుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ ( న్యాజూ) , ఐవోసీఎల్ ( ×ూజూ ), బీపీసీఎల్ ( ధీూజూ) వంటి కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని తెలిపారు.రాష్ట్ర వార్తలుసరఫరా గొలుసు ఎక్కడా ఆగలేదని, భయం వల్ల ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 2.5 నుంచి 3 రెట్లు విక్రయాలు పెరిగాయని వివరించారు. దీనివల్ల కొన్ని బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ అయిపోవచ్చు. కానీ అది కొరత కాదని, పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి నిల్వ చేయడం పీఈఎస్‌వో నిబంధనలకు విరుద్ధమని అన్నారు.ఇటువంటి చర్యలు చాలా ప్రమాదకరమని, అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమకు అవసరమైనంత మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

## ఆర్టిసి ప్రయాణికులకు శుభవార్త.. మెట్రో ఎసి, డీలక్స్ బస్స బస్సుల్లో 30 శాతం డిస్కౌంట్




హైదరాబాద్ మార్చ్ 25 చమురు కొరత వార్తలు సంచలనం సృష్టించాయి. ఏ బంక్‌లో చూసిన వాహనదారులు ఇంధనం కోసం బారులు తీరుతున్నారు. కొంతమంది పెద్ద బాటిల్స్‌లో, క్యాన్లలో పెట్రోల్‌ను కొనుగోలు చేసి తీసుకుపోతున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఆర్టిసి చల్లటి వార్త అందించింది. హైదరాబాద్ పరిధిలోని మెట్రో ఎసి, డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 'పెట్రోల్ కష్టాలు పడడం ఎందుకు దండగ, ఆర్టిసి బస్సులు ఉండగా' అని ఆర్టిసి ఎండి నాగిరెడ్డి పేర్కొన్నారు. బంకుల వద్ద బారులు తీరొద్దని.. సురక్షితంగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు.

## జి.ఓ. నెం. 84 వ్యతిరేకంగా తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ అసంబ్లీ ముట్టడి
## పోలిసుల అరెస్ట్ ..ఆయా పోలిస్ స్టేషన్ కు తరలింపు












హైదరాబాద్, మార్చి 25,తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 84 మరియు కొత్త ఔట్‌డోర్ ప్రకటన విధానానికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ (టూమీ) బుదవారం అసంబ్లీ ముట్టది కార్యక్రమాన్ని చేపట్టింది.. రాష్ట్ర అసెంబ్లీ వద్ద నిరసన చేపట్టి, "అసెంబ్లీ మార్చ్" నిర్వహించింది.ఈ నిరసనలో వందలాది ఔట్‌డోర్ మీడియా యజమానులు, కార్మికులు మరియు పరిశ్రమకు చెందిన ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఔట్‌డోర్ ప్రకటన రంగం మనుగడను ప్రమాదంలోకి నెట్టే "పరిశ్రమ వ్యతిరేక" విధానంగా వారు అభివర్ణిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారులు నినాదాలు చేస్తూ, జి.ఓ. నెం. 84 ను వెంటనే రద్దు చేయాలని, కొత్త విధానాన్ని పూర్తిగా పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.టూమీ ప్రతినిధులు పేర్కొన్న ప్రకారం, ఈ కొత్త నిబంధనలు పరిశ్రమకు చెందిన భాగస్వాములతో సరైన సంప్రదింపులు లేకుండానే అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సమగ్ర చర్చలు జరపాలని ముందుగా ఉన్న మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత రూపంలో ఈ విధానం వేలాది వ్యాపారాలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉందని, ఔట్‌డోర్ ప్రకటన రంగంపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు లక్ష కుటుంబాల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.జి.ఓ. నెం. 84 అమలు విషయంలో ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం మొత్తం ఔట్‌డోర్ మీడియా పరిశ్రమను ప్రమాదంలోకి నెట్టింది. మేము నియంత్రణకు వ్యతిరేకం కాదు, కానీ విధానాలు వాస్తవానికి అనుగుణంగా, పారదర్శకంగా ఉండాలి మరియు భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా రూపొందించాలి," అని టూమీ ప్రధాన కార్యదర్శి శ్రీ రమేష్ నిరసన సందర్భంగా పేర్కొన్నారు.ఈ విధానం అమలు విషయంలో ఆలస్యాలు, స్పష్టత లేమి, అధిక అనుసరణ భారాలు వంటి అనేక పరిపాలనా మరియు కార్యాచరణ సమస్యలను కూడా సంఘం ప్రస్తావించింది. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించింది.టూమీ తెలంగాణ ప్రభుత్వం మరియు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని తక్షణం జోక్యం చేసుకుని, జి.ఓ. నెం. 84 అమలును నిలిపివేసి, పరిశ్రమ ప్రతినిధులతో సార్థక చర్చలు ప్రారంభించి, సమతుల్యమైన మరియు స్థిరమైన విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేసారు..

## పేద స్వర్ణకారుడి వైద్యానికి రూ. 42 వేల వెస్సో సహాయం



హైదరాబాద్ మార్చ్ 25 ; మీర్‌పేట్, సరూర్ నగర్ నివాసి శ్రీ రంగంగారి నరేష్ చారి (40) వృత్తి రీత్యా స్వర్ణకారులు; స్థానిక జ్యువెలరీ షాపులో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల ఆయనకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో సమీపం లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స జరుగుతున్న సమయంలో ఒక యాంటీ బయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత అకస్మాత్తుగా హార్ట్ అటాక్ (కార్డియాక్ అరెస్ట్) వచ్చి, దానితో పాటు, మెదడుకు కూడా గాయమైనట్లు వైద్యులు గుర్తించారు.ఇప్పటి వరకు వారి కుటుంబం ఆయన చికిత్స కోసం తమ శక్తిని మించి ఖర్చు చేసింది. మొదట ఈ చికిత్స ఇన్సూరెన్స్ క్రింద కవర్ అవుతుందని భావించినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇన్సూరెన్స్ కంపెనీ వారి క్లెయిమ్‌ను అంగీకరించ లేదు. అందువలన వారి కుటుంబం ఇప్పటి వరకు సుమారు ?2,00,000/- నగదుగా చెల్లించ వలసి వచ్చింది. వారి కుటుంబం ఆర్థికంగా బలహీన స్థితిలో ఉండడం తో, ఆయన భార్య శిరీష పెరుగుతున్న ఆసుపత్రి ఖర్చులను భరించ లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితిలో వెస్సో ట్రస్ట్ గురించి తెలుసుకుని, స్థానిక సంఘ నాయకుల ద్వారా తన భర్త చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించమని వెస్సో ను కోరారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శిరీష కు42,400 రూపాయలు అందజేశారు.

## ఇరాన్ వార్ ఎఫెక్ట్.. త్వరలో 10-12 శాతం బీర్ల ధరలు పెరిగే ఛాన్స్...



న్యూ డిల్లీ మార్చ్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. త్వరలో ఎరువుల కొరత వేధించే అవకాశం ఉంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. ఇండియాలో త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరల్ని పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ యుద్ధం కారణంగా రవాణా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. బీర్ల తయారీలో వాడే గ్లాస్ బాటిల్స్, అల్యూమినియం క్యాన్ల తయారీకి అవసరమైన ముడిసరుకు విదేశాల నుంచే వస్తుంది. ప్రస్తుతం యుద్ధం కారణంగా రవాణా నిలిచిపోయి, వీటి దిగుమతులు ఆగిపోయాయి. దీంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చమురు ధరలు పెరగడం కూడా బీర్ల తయారీపై ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో నాలుగోవంతు నేచురల్ గ్యాస్‌ను ఇండియా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అది కూడా ఎక్కువగా పశ్చిమాసియా నుంచే వస్తుంది. అందులోనూ ఖతార్ నుంచే 40 శాతం చమురు దిగుమతి అవుతుంటుంది. కానీ, ఇప్పుడు గ్యాస్ సరఫరా లేక చమురు ధరలు పెరగడం, బాటిల్స్ సరఫరా నిలిచిపోవడంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా గ్లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి.లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. ఫలితంగానే రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధరలు పెంచాలని ప్రయత్నిస్తున్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని ప్రభుత్వాల్ని కోరుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వాలు అంగీకరిస్తే త్వరలోనే బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టిన ఇసుక ట్రాక్టర్

తాండూరు వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం బషీరాబాద్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇసుక ట్రాక్టర్ వాహనము పోలీస్ రక్షక వాహనాన్ని ఢీ కొట్టింది. వివరాలకు వెళ్తే .. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీశైలం యాదవ్ బీట్ నిర్వహిస్తుండగా మంగళవారం ఉదయం తెల్లవారుజామున మండల లోని దామర్చాడ్ గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీశైలం యాదవ్ వాహనాన్ని చూసి అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ వాహనం నడుపుతూ ఒక్కసారిగా పోలీస్ రక్షక వాహనాన్ని ఢీ కొట్టి గనుల వైపు పరారయ్యారు. ఇసుక ట్రాక్టర్ ఎవరిది అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ గనుల వైపు వెళ్లడంతో ఇంతవరకు ఆచూకీ లభించలేదు.

# ఏసీబీ వలలో ఎంవిఐ

ఖమ్మం జిల్లా వైరా రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమేష్ దాడులు నిర్వహించారు. ఎంవిఐ వరప్రసాద్ అసిస్టెంట్ రాజశేఖర్ ఇటుక బట్టి వ్యాపారి నుంచి 24 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కారులో అనధికారికంగా ఉన్న 50వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎంవిఐ వరప్రసాద్ ను అరెస్టు చేపారు. అక్కడ ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ ఇంటిపై సోదాలు చేపట్టారు.

# తెలంగాణ సెమాగ్లుటైడ్ బ్యాన్

హైదరాబాద్, మార్చి 25, బరువు తగ్గడం కోసం, మధుమేహ నియంత్రణ కోసం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతున్న సెమాగ్లుటైడ్ మెడిసిన్ వాడకంపై తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా, సొంత నిర్ణయాలతో ఈ మందులను వాడటం వల్ల ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల ఈ ఔషధాలకు సంబంధించిన పేటెంట్ గడువు ముగియడంతో మార్కెట్‌లోకి అనేక రకాల కొత్త ఫార్ములేషన్లు అందుబాటులోకి వస్తున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. సెమాగ్లుటైడ్ అనేది గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 రిసెప్టర్ అగోనిస్ట్ అనే తరగతికి చెందిన ఔషధం. ఇది శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతోపాటు, ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా టైప్ -2 డయాబెటిస్ బాధితులకు ఇది ఒక వరప్రసాదంగా మారింది. అయితే ఇటీవల కాలంలో కేవలం బరువు తగ్గడం కోసమే దీనిని వాడే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. గత వారమే ఈ ఔషధాల అసలు ఆవిష్కర్త పేటెంట్ గడువు ముగిసింది. దీని వల్ల వివిధ కంపెనీలు మల్టీ డోస్ వయల్స్, ప్రీ- ఫీల్డ్ పెన్స్ రూపంలో సెమాగ్లుటైడ్ ఫార్ములేషన్లు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న ఈ మందులపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ విక్రయాలు జరిగే అవకాశం ఉందని ఆఅం గుర్తించింది. తెలంగాణ డీసీఏ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సెమాగ్లుటైడ్ కేవలం రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ల పర్యవేక్షణలో వాడాలి. ఎండోక్రినాలజిస్టులు, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టులు మాత్రమే ఈ మందులను ప్రిస్క్రైబ్ చేయాలి. గుండె సంబంధిత సమస్యలు ఉండి, ఆమోదించే సంకేతాలు ఉన్న సందర్భాల్లో మాత్రమే కార్డియాలజిస్టులు దీనిని సూచించవచ్చు. రోగికి ఈ మందును సూచించే ముందు వారి ఆరోగ్య చరిత్ర, ఇప్పటికే ఉన్న ఇతర వ్యాధులు, ఎదురయ్యే ముప్పును వైద్యులు నిశితంగా పరిశీలించారు. సరైన మోతాదు, ఎంత కాలం వాడాలి అనే విషయాలను నిపుణులైన డాక్టర్లు మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుంది.

అజాగ్రత్తా వాడితే పొంచి ఉన్న సమస్యలు

సరైన వైద్య పర్యవేక్షణ లేని పక్షంలో సెమాగ్లుటైడ్ వాడకం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని డీసీఏ హెచ్చరించింది. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్ అంటే క్లోమగ్రంథి వాస్తుంది. మూత్రపిండాలు ఒక్కసారిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. విపరీతమైన కడుపు నొప్పి, వాంతులు, ఇతర తీవ్రమైన ప్రతి చర్యలు ఉంటాయి. గాల్ బ్లాడర్‌లో రాళ్లు రావడం, ఇతర సమస్యలు రావచ్చు. ప్రజలు సెమాగ్లుటైడ్ మెడిసిన్‌ను కేవలం లైసెన్స్ ఉన్న మెడికల్ షాపులో నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, అనధికారక విక్రేతల వద్ద, ఇతర చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా వీటిని ఆర్డర్ చేయొద్దు. ఇలాంటి మార్గాల్లో లభించే మందులు నకిలీవి, నాణ్యత లేనివి, హాని చేసేవి అయ్యి ఉంటాయని హెచ్చరించింది.

## తయారీదారులకు హెచ్చరిక

మందుల తయారీ కంపెనీలకు కూడా ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసింది. సెమాగ్లుటైడ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ఎటువంటి పరోక్ష ప్రకటనలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా లేదా అన్ అప్రూవ్డ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ప్రమోషన్లు చేస్తే చర్యలు తప్పవని చెప్పింది. ఒక వేళ ఎక్కడైనా ఈ మందులను అక్రమంగా విక్రయిస్తున్నట్టు తెలిసినా, అనధికారికంగా ప్రచారం చేస్తున్నట్టు గమనించినా వెంటనే తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలను కోరారు.

# పల్లె నిద్ర' తో ప్రజలకు మరింత చేరువగా పోలీసులు

కడప ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లెలమ్మ పల్లి గ్రామంలో ఎస్.ఐ శ్రీప్రియ రి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి.. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో చాలామంది వ్యక్తులు సైబర్ మోసాలకు గురవుతున్నారని, నేరాలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించి, అప్రమత్తంగా ఉండాలని కోరారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది సైబర్ నేరగాళ్ళు వాట్సాప్ కాల్స్ చేసి తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటి నుండి బయటకు వెళ్ళ వద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని, ఆధార్ కార్డును దుర్వినియోగం చేసారని, మీ పిల్లలపై డ్రగ్స్ కేసు నమోదయ్యిందని, సిబిఐ లేదా ఎన్ఫోర్స్మెంట్ లేదా సిఐడి లేదా కోర్టు నుండి అధికారులుగా పరిచయం చేసుకొని, బెదిరింపులకు పాల్పడుతుంటారని, చివరకు సహాయం చేస్తున్నట్లుగా నమ్మబలికి, అమాయకుల నుండి డబ్బులను కొల్లగొడుతున్నారన్నారు. ఇటువంటి నేరగాళ్ళు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, ఎవరైనా ఈ తరహాలో ఫోన్ కాల్ వస్తే సమాచారాన్ని డయల్ 112 లేదా 1930కు అందించాలని ఎస్.ఐ సూచించారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, ఉత్తమ మార్గంలో నడిపి, ఉన్నత స్థానాలకు చేరుకొనే విధంగా చూడాలన్నారు. చదువుకొనే సమయంలో మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి చెడు వ్యసనాలకు అలవాటుపడకుండా ఒక కంట కనిపెట్టాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గద్దర్ అవార్డ్స్ లో స్కాం...!
## రెండు కోట్లకు టెండర్... నాలుగు కోట్ల ఖర్చా...

హైదరాబాద్, మార్చి 25, తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో కుంభకోణం జరిగిందా.. కోట్ల రూపాయలు దారి మళ్లాయా? ఇందులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారా.. ముందుగా అనుకున్న దానికంటే.. ఎక్కువ ఖర్చు పెట్టారా.. ఇందులో ఎవరి పాత్ర ఎంత.. ఇప్పుడు ఇవే విషయాలను బయటపెట్టారు గులాబీ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.గద్దర్ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసిందని శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు.

జ్యూరి సభ్యులను.. సినీ పెద్దలను అవమానించారని విమర్శించారు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన వ్యవహారంపై ప్రభుత్వం నోరు విప్పాలని.. ఎఫ్ డీ సీ చైర్మన్.. సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న హైటెక్స్ లో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను అందజేత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను విజ్ క్రాఫ్ట్ అనే ముంబైకి చెందిన కంపెనీకి అప్పగించింది. అయితే అందులో ఉన్న లెక్కలకు సంబంధించిన ఓ కాపీ బయటికి వచ్చింది. దీనిని శ్రవణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.అవార్డుల ఫంక్షన్ లో శ్రేయ ఘోషల్ కు 1,65,00,000, దేవిశ్రీప్రసాద్ కు 60,00,000, దేవిశ్రీప్రసాద్ టెక్ రైడర్ కు 20,00,000, నిధి అగర్వాల్ కు 20,00,000, లివ బీనిఎవజీబిజీఎశ్రీవ (బజూవఇఁతిజీశ్రీ జీఇఁబి) 10,50,000, ఇఁశ్రీజీబబతిఇఁజీశ్రీ జీఇఁబి 6,50,000, వ్యాఖ్యాతలు సుమ, ప్రదీప్ కు 13 లక్షలు, కొరియోగ్రఫీ చేసిన వారికి 39,20,000, కాస్ట్యూమ్స్ కు ఐదు లక్షలు.. ప్రయాణానికి.. బస, భోజనాల ఖర్చుకు 60 లక్షలు.. రెడ్ కార్పెట్ యాంకర్లకు ఏడు లక్షలు.. హెయిర్.. మేకప్ వేసిన వారికి ఐదు లక్షలు.. మొత్తం ఆర్టిస్టుల ఖర్చు నాలుగు కోట్ల 11 లక్షల 20,000 బిల్లు అయింది.. వేదిక.. లైటింగ్.. ఇతర ఖర్చులకు భారీగా వెచ్చించారని శ్రవణ్ ఆరోపించారు. ఇక ఇదే డాక్యుమెంట్లో టెండర్ కాస్ట్ కాలంలో రెండు కోట్ల 13 లక్షలని ఉందని.. అయితే అసలు బిల్లు మాత్రం నాలుగు కోట్ల 11 లక్షల ఇరవై వేలని.. అనుకున్న దానికంటే రెండు కోట్లు అదనంగా ఖర్చు పెట్టారని శ్రవణ్ ఆరోపించారు. ఈ అదనపు ఖర్చును ఎఫ్డిసి చైర్మన్ లేదా సినిమాటోగ్రఫీ మంత్రి భరిస్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు. విజ్ క్రాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిన వ్యక్తులు ఎవరని.. తెలంగాణ ప్రాంతంలో ఎటువంటి ఏజెన్సీలు లేవా.. దీనికి ఏమైనా ఓపెన్ టెండర్లు పిలిచారా.. లేదా ప్రభుత్వం తమకు కావలసిన వారికి కట్టబెట్టిందా అని.. శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉండిపోయాయని.. కానీ ఒకరోజు ధూంధాం వేడుకకు నాలుగు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని శ్రవణ్ ప్రశ్నించారు.

# సికింద్రాబాద్ పెట్రోల్ బంకుల్లో రద్దీ

సికింద్రాబాద్ లోని పలు ప్రాంతాలలో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ పెరిగింది. పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే భావనతో ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు వాహనదారులు పోటెత్తడంతో పెట్రోల్ బంకులు కిక్కిరిస్తున్నాయి. సంగీత కూడలి వద్ద ఉన్న రెండు పెట్రోల్ బంకులలో అర కిలోమీటర్ మేరా వాహనదారులు పెట్రోల్ పోయించుకునేందుకు బారులో తీరడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పెట్రోల్ కొరత ఏర్పడి ధరలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు పరుగులు తీస్తున్నారు.

# అధికార పార్టీలకు అడ్వాంటేజ్

విజయవాడ, హైదరాబాద్, మార్చి 25, దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నియోజకవర్గాల పునర్విభజన చేసిన తర్వాతే వచ్చే ఎన్నికలు జరుగుతాయని కేంద్రం క్లారిటీ ఇస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, అది రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసే గేమ్ ఛేంజర్ . 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన, 2029 ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ యోచన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 26 ప్రకారం సీట్ల పెంపుదల అంశం మళ్లీ తెరపైకి రావడంతో, ఏ ప్రాంతానికి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ పార్టీకి లబ్ధి చేకూరుతుంది? అనే విశ్లేషణలు మొదలయ్యాయి.చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 175 నుండి 225కు, తెలంగాణలో 119 నుండి 153కు పెరగాల్సి ఉంది. అంటే ఏపీలో అదనంగా 50 స్థానాలు, తెలంగాణలో 34 స్థానాలు కొత్తగా రానున్నాయి. అయితే, రిపోర్టుల ప్రకారం ప్రతి రాష్ట్రంలో 50 శాతం మేర సీట్లు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే ఏపీలో సీట్ల సంఖ్య 260 దాటవచ్చు, తెలంగాణలో 180కి చేరుకోవచ్చు. ఈ పెరుగుదల రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది కానుంది.తెలంగాణ విషయానికి వస్తే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల్లో అత్యధిక సీట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. పునర్విభజన జరిగితే ఈ ఒక్కో నియోజకవర్గం రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విడిపోయే ఛాన్స్ ఉంది. దీనివల్ల రాష్ట్ర రాజకీయం మరింతగా పట్టణ ప్రాంతాల ఓటర్లపై ఆధారపడే పరిస్థితి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో సీట్ల పెరుగుదల తక్కువగా ఉంటే, అధికార పీఠం దక్కించుకోవడంలో అర్బన్ ఓటింగ్ అత్యంత కీలకం కానుంది.ఏపీలో సీట్ల పెంపు ప్రాంతాల వారీగా తీవ్ర ప్రభావం చూపనుంది.

2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో జనాభా సాంద్రత ఎక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి నగరాల పరిధిలో కొత్త నియోజకవర్గాలు పుట్టుకొస్తాయి. దీనికి భిన్నంగా రాయలసీమలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగకపోవచ్చు. ఇది అసెంబ్లీలో రాయలసీమ ప్రాంతం యొక్క రాజకీయ బలాన్ని కొంత తగ్గించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.సీట్ల సంఖ్య పెరగడం వల్ల రాజకీయ పార్టీల్లో కొత్త తలనొప్పులు మొదలవుతాయి. నియోజకవర్గాల పరిధి తగ్గడం వల్ల స్థానిక నాయకత్వం బలం పెరుగుతుంది. పెద్ద నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు బలమైన నేతలు ఉన్న చోట, సీట్ల పెంపు వల్ల గ్రూపు తగాదాలు తగ్గే అవకాశం ఉన్నా, కొత్తగా ఏర్పడే స్థానాల్లో తమ వర్గాన్ని నిలబెట్టుకునేందుకు అగ్రనేతలు పోటీ పడతారు. అలాగే, మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే, పెరిగిన సీట్లలో అధిక భాగం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. ఇది పురుష రాజకీయ నేతల ఆధిపత్యానికి గండి కొట్టే అంశం. 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల జనాభా నియంత్రణ పాటించిన ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన కూడా ఉంది. ఉదాహరణకు, అమరావతి లేదా విశాఖ వంటి ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో జనాభా భారీగా పెరిగింది, కానీ 2011 లెక్కలనే వాడితే ఆ మార్పులు ప్రతిబింబించవు. అయినప్పటికీ, సీట్ల పెంపుదల వల్ల అసెంబ్లీలో ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, పాలన ప్రజలకు మరింత చేరువవుతుందన్నది సానుకూల అంశం. 2029 నాటికి జరగబోయే ఈ నియోజకవర్గాల పునర్విభజన తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త రాజకీయ శకానికి తెరతీయనుంది. ప్రాంతీయ బలాబలాలు, సామాజిక సమీకరణాలు , పార్టీల వ్యూహాలు అన్నీ కలిపి అధికార పార్టీలకు అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# అన్నాడీఎంకే వింత హామీలు..

చెన్నై, మార్చి 25, (న్యూస్ పల్స్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నా డీఎంకే అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో 297 వాగ్దానాలతో కూడిన భారీ మేనిఫెస్టోను విడుదల చేశారు. సామాన్యులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రకటించిన ఈ పథకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. అమ్మ పాలనను గుర్తుచేసేలా ఇంటికో ఫ్రిడ్జ్, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి హామీలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.ఈ మేనిఫెస్టోలో అత్యంత ఆకర్షణీయమైన అంశం పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం . ప్రస్తుతం అధికార డీఎంకే ప్రభుత్వం కేవలం మహిళలకు మాత్రమే కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని, అన్నా డీఎంకే తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించింది. దీనితో పాటు, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక రిఫ్రిజిరేటర్ ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. గతంలో మిక్సీలు, గ్రైండర్లు ఇచ్చిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు ఫ్రిడ్జ్‌ను జాబితాలో చేర్చారు. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్నా డీఎంకే వరాల జల్లు కురిపించింది.

కుల విళక్కు పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళా యజమానికి నెలకు రూ. 2,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. అలాగే, ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని, నిలిపివేసిన తాలికి బంగారం మంగళసూత్రం కోసం బంగారం ,వివాహ ఆర్థిక సాయం పథకాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టం చేసింది. ఆడపిల్లల రక్షణ పథకం కింద ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని రూ. 50 వేల నుండి రూ. 1 లక్షకు పెంచుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు , కుటుంబాల సౌభాగ్యం కోసం సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని అన్నా డీఎంకే వాగ్దానం చేసింది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ మద్యం దుకాణాలను దశలవారీగా మూసివేస్తామని ఎడప్పాడి పళనిస్వామి భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయం మహిళా లోకం నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. యువతను ఆకట్టుకోవడానికి నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 2,000 చొప్పున భృతి కల్పిస్తామని, ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, వృద్ధాప్య పింఛన్ల పెంపు వంటి అంశాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. అన్నా డీఎంకే ప్రకటించిన ఈ ఉచిత పథకాలు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. డీఎంకే పథకాలకు ధీటుగా, అంతకు మించిన హామీలను గుప్పించడం ద్వారా పీఠాన్ని దక్కించుకోవాలని అన్నా డీఎంకే గట్టి పట్టుదలతో కనిపిస్తోంది.

# ఎడతెగని భద్రాద్రి పంచాయితీ

ఖమ్మం, మార్చి 25, మనదేశంలో.. ముఖ్యంగా దక్షిణాది ప్రాంతంలో ఒక మనిషి పేరుకు ముందు ఇంటి పేరు ఉంటుంది. ఆ తర్వాత కులం.. అనంతరం గోత్రం ఉంటుంది.. ఇది ఇప్పటిది కాదు.. తరతరాలుగా సాగుతూ వస్తోంది. కులాన్ని.. గోత్రాన్ని కొంతమంది వ్యతిరేకించినప్పటికీ.. చాలామంది నేటికీ అనుసరిస్తూనే ఉంటారు..కులాలు.. గోత్రాలు కేవలం మనుషులకు మాత్రమే కాదు.. దేవతామూర్తులకు కూడా ఉంటాయి. దేవతామూర్తులకు కులాలను.. గోత్రాలను ఆపాదించడం ఈనాటిది కాదు.. దాని వెనక ఏళ్ల చరిత్ర ఉంది. ఆయా దేవుళ్లను వివిధ కులాలవారు ఆపాదించుకోవడం పరిపాటిగా మారింది.ఇప్పటివరకు కులాలు.. గోత్రాల విషయంలో ఏ దేవుళ్ళు కూడా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. వివాదాస్పదమైన సందర్భాలు కూడా లేవు. అయితే తొలిసారిగా ఇటువంటి ఇబ్బందులు శ్రీ సీతారామ చంద్రుడు ఎదుర్కొంటున్నాడు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. సీతారామ చంద్రుడికి ఆస్థాయిలో ఇబ్బంది ఎందుకు కలిగింది.. గోత్రం విషయంలో స్వామివారు ఎందుకు కోర్టు మెట్లు ఎక్కారు.. ఈ ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానమే ఈ కథనభద్రాద్రి రామయ్య గోత్రం వశిష్ట. సీతమ్మది గౌతమస గోత్రం. ఈ గోత్రాల పేర్లను చదువుతూ అర్చకులు పూజలు చేస్తూ ఉంటారు. 2012 తర్వాత పండితులు స్వామివారిని అచ్యుత.. అమ్మవారిని సౌభాగ్య గోత్రాలుగా చదువుతున్నారు. ఈ మార్పు వెనుక ఉద్దేశం ఏమిటో తెలియదు. అయితే సీతారామ చంద్రుల గోత్రాలను 2012 నుంచి మార్చి చదువుతున్నారని ఓ భక్తుడు కోర్టు దాకా వెళ్లాడు.2022లో తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఒక కమిటీ ఏర్పాటు అయింది. ఆ కమిటీ దేవాదాయ శాఖకు నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికను దేవాదాయ శాఖ బయట పెట్టలేదు. దీంతో ఆ వ్యక్తి మళ్ళీ కోర్టును ఆశ్రయించాడు.

దీనిపై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ సున్నితమైన వివాదంపై కోర్టు ఎలా విచారిస్తుంది? ఎటువంటి తీర్పు ఇస్తుంది అనేది చూడాల్సి ఉంటుంది.సీతారామచంద్రస్వామికి గురువారం రోజుల్లో కళ్యాణం.. మరో శుక్రవారం పట్టాభిషేకం జరుగుతాయి. ఇంతటి మహత్కార్యాల ముందు స్వామివారు గోత్రానికి సంబంధించి వివాదం ఎదుర్కోవడం.. అది కూడా కోర్టు దాకా వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్వామివారి గోత్రాలను మార్చి ఎందుకు చదువుతున్నారు.. గతంలో చదివిన వాటిని ఎందుకు పక్కన పెట్టారు.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు.

# కఫీస్ బిస్ట్రో ప్రారంభం




హైదరాబాద్ నగరంలోని కాఫీ కల్చర్, కాఫీ బవర్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అన్ని రకాల గ్లోబల్ బ్రాండ్స్ సైతం నగరంలో సందడి చేస్తున్నాయి. అయితే ఈ క్రమంలో చిక్మగళూరు నుండి నాగాలాండ్ వరకు ఆరు భారతీయ కాఫీ ప్రాంతాల గింజల సమ్మేళ నంతో వినూత్నంగా హార్ట్మేడ్ ఇండియన్' తత్వంతో రూపొందిన కఫీన్ బిస్ట్రో బంజారాహిల్స్లో ప్రారంభమైంది. నగరం కాఫీ ప్రేమికుల కోసం భారతీయ కాపీ సంస్కృతి, పాకశాస్త్ర నైపుణ్యపు అతిథ్యాన్ని ఒకే వేదికపై అందిస్తోంది.. సరికొత్త 'బాఫిని ట్రెండ్' తో ఎస్ప్రెస్సో నుంచి ఫిల్టర్ కాఫీ వరకూ ప్రత్యేక అనుభూతిని అందించడమే తమ ప్రత్యేకత అని ఓహ్రీస్ గ్రూప్ అధి నేత అమర్ ఓహ్రి తెలిపారు. నగర లైఫ్ స్టైల్కు అనుగుణంగా సమకాలీన డిజైన్, మట్టి రంగులతో ఈ బిస్ట్రో రూపొందించామని అన్నారు. హౌస్ క్లాస్ కృతో పాటు గణర్ లాటే, కాఫీ నారియల్ వంటి సిగ్నేచర్ డ్రింక్స్ నగర కాఫీ లవరేను అలరిస్తున్నాయని, భారతీయ కాఫీని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లా అనే లక్ష్యంలో భాగంగా ఈ వేదిక సహాయపడుతుందని సోనాల్ ఓహ్రి పేర్కొన్నారు.

# వ్యూహాత్మకంగా దెబ్బ తీస్తున్న రేవంత్



హైదరాబాద్, మార్చి 25, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా బలహీనం చేయాలనుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన మొదటగా ఆ పార్టీ ముఖ్యనేతలను బలహీనం చేయాలనుకుంటున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కంచుకోటలను బద్దలు కొట్టాలనుకుంటున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల ఈ మూడు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఈ కోటలనే లక్ష్యంగా చేసుకుని, గులాబీ దళపతులైన హరీష్ రావు, కేసీఆర్, , కేటీఆర్‌లను రాజకీయంగా బలహీనపరిచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దీనికి స్పష్టమైన సంకేతం. హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో అడుగుపెట్టిన రేవంత్, అక్కడ అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపుతూనే, రాజకీయంగా ఆధిపత్యం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం గెలవడమే కాదు, ప్రత్యర్థి నాయకత్వాన్ని స్థానికంగా దెబ్బతీయాలన్నది రేవంత్ మాస్టర్ ప్లాన్. రేవంత్ రెడ్డి అనుకుంటున్నంత సులభంగా ఈ మూడు నియోజకవర్గాల్లో మార్పు రావడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిద్ధిపేటలో హరీష్ రావుకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, గజ్వేల్‌లో కేసీఆర్ పట్ల ఉన్న సెంటిమెంట్, సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆ నాయకులను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ ముగ్గురూ తమ నియోజకవర్గాల్లో కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, కుటుంబ సభ్యులుగా స్థిరపడిపోయారు. వారిని ఢీకొనాలంటే కేవలం అధికార బలం సరిపోదు, అంతకు మించిన ప్రజాదరణ ఉన్న నేతలు కాంగ్రెస్ వైపు ఉండాలి. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం. సిద్ధిపేటలో హరీష్ రావుకు దీటైన నాయకుడు కానీ, సిరిసిల్లలో కేటీఆర్‌ను అడ్డుకోగల చరిష్మా ఉన్న నేత కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడకుండా, కేవలం పైస్థాయి నుంచి చేసే విమర్శలు ఓట్లుగా మారవు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బీఆర్ఎస్ అగ్రనేతల ప్రభావాన్ని తగ్గించగలిగే మాస్ లీడర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. గతంలో ఇంద్రుడిలా వెలిగిన ఎందరో అగ్రనేతలు తమ సొంత గడ్డపైనే ఓటమి పాలైన చరిత్ర ఉంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. ప్రభుత్వ పథకాలను ఈ నియోజకవర్గాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, బీఆర్ఎస్ కేడర్‌ను ఆకర్షించడం ద్వారా ఆ కోటలను బీటలు వారేలా చేయవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారనే ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం రేవంత్ ముందున్న సవాలు. రేవంత్ రెడ్డి సంకల్పం గట్టిగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని మర్చిపోయేలా చేసే స్థాయి ఉన్న నేతలు స్థానికంగా ఎదిగితేనే కాంగ్రెస్‌కు అక్కడ భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలిగితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మలుపు అవుతుంది. ఇప్పటికే అక్కడ బలమైన నేతల్ని గుర్తించి ప్రోత్సహించే వ్యూహాన్ని రేవంత్ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల్ని రెడీ చేసుకున్నా అది బీఆర్ఎస్ పార్టీ వ్యూహాల్లో కీలకమైన మార్పులు తెస్తుంది. మరి రేవంత్ రాజకీయం ఈ సారి ఆయన వ్యూహాలకు తగ్గట్లుగా సాగుతుందా?

# కరీంనగర్ లో మిస్టరీ డెత్స్...

కరీంనగర్, మార్చి 25,విరూపాక్ష సినిమా చూశారా.. అందులో ఊళ్లో వాళ్లంతా ఒక్కొక్కరుగా చనిపోతూ ఉంటారు. దీంతో ఆ గ్రామంలో ఉన్న మత పెద్ద శాసనాల గ్రంధాన్ని తెరుస్తాడు. ఊరిలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తాడు. ఊరికి కీడు జరిగిందని.. ఊరంతా ఖాళీ చేయాలని చెబుతాడు. అదంతా సినిమా కాబట్టి.. కాస్త వాస్తవానికి దూరంగానే ఉంటుంది. కానీ నిజంగా ఇలాంటి సంఘటన తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. ఇంతకీ ఈ సంఘటన ఏ గ్రామంలో జరిగింది.. అక్కడ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.. వీటిపై ప్రత్యేక కథనం..తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో గడిచిన 3 నెలలుగా వరుసగా 28 మంది చనిపోయారు. వివిధ కారణాలతో వారు చనిపోవడంతో గ్రామంలో ఆందోళన ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తమ ఊరికి ఏదో కీడు సోకి ఉంటుందని బలంగా నమ్మారు. గ్రామదేవతలకు పూజలు చేశారు. అయినప్పటికీ మరణాలు ఆగలేదు. దీంతో స్థానికంగా ఉన్న ఓ పూజారిని కలిశారు. గ్రామంలో జరుగుతున్న పరిణామాలను అతని దృష్టికి తీసుకెళ్లారు.అ పూజారి వారు చెప్పిన మాటలు మొత్తం విన్న తర్వాత.. ఒక కీలకమైన విషయాన్ని చెప్పాడు. గ్రామానికి కీడు సోకిందని.. గ్రామంలో ఉన్న వారంతా ఒకరోజు తమ తమ గృహాలను ఖాళీ చేయాలని.. పొలాల్లోకి వెళ్లి కీడు వంటలు చేసుకోవాలని చెప్పారు. దీంతో గ్రామస్తులు తెల్లవారుజామునే వారి వారి గృహాలకు తాళాలు వేశారు. దప్పు చాటింపు చేశారు. అందరూ కలిసి ముకుమ్మడిగా గ్రామం దాటి వెళ్లిపోయారు. తన పొలాల్లో కీడు వంటలు చేసుకొని.. పితృదేవతలకు పెట్టి.. ఆ తర్వాత భుజించారు. ఇలా చేస్తే తమ గ్రామానికి పట్టిన కీడు తొలగిపోతుందని అక్కడి ప్రజలు నమ్ముతున్నారు.మూడు నెలల్లో 28 మంది చనిపోవడంతో ఆ గ్రామంలో ఒక రకమైన ఆందోళన ఏర్పడింది. ఇందులో కొంతమంది అనారోగ్యంతో చనిపోయారు. మరి కొంతమంది రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇంకొంతమంది బలవంతంగా ఆత్మహత్యలు చేసుకున్నారు.. 3 నెలల కాలంలోనే 28 మంది చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. జంతువులను కూడా బలులు ఇచ్చారు. అయినప్పటికీ మరణ మృదంగం ఆగలేదు. అయితే ఇప్పుడు కీడు వంటలు చేసుకున్న నేపథ్యంలో.. తమ గ్రామానికి అంతా మంచే జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకపై గ్రామంలో మరణ మృదంగం ఆగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# ఐటీ సిటీకి గండం...

హైదరాబాద్, మార్చి 25, సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతున్న భాగ్యనగర ఐటీ కోటకు బీటలు వారుతున్నాయా? దశాబ్ద కాలంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం.. ఇప్పుడు మొదటిసారిగా తిరోగమనం వైపు అడుగులు వేస్తోందా? కేవలం గణాంకాల తగ్గుదల మాత్రమే కాదు.. ఏఐ విసిరిన సవాలు.. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి హైదరాబాద్ ఐటీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజకీయ విమర్శల వెనుక దాగి ఉన్న అసలు చేదు నిజం ఏమిటి? ఇది కేవలం ఒక తాత్కాలిక మందగమనమా లేక పెను సంక్షోభానికి సంకేతమా? అన్నది చర్చనీయాంశమైంది.హైదరాబాద్ ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గడిచిన దశాబ్ద కాలంగా అప్రతిహత వృద్ధితో దూసుకుపోయిన ఈ రంగంలో మొదటిసారిగా 'రివర్స్ ట్రెండ్' కనిపిస్తుండటం అటు నిరుద్యోగులను, ఇటు ఆర్థిక నిపుణులను కలవరపెడుతోంది. గణాంకాలు చెబుతున్న చేదు నిజం తెలంగాణ మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ సెగలను మించి ఐటీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయిందని ప్రభుత్వం స్వయంగా గణాంకాల్లో వెల్లడించడం గమనార్హం. అంటే మూడేళ్ల కాలంలో సుమారు 7,000 ఉద్యోగాల తగ్గుదల నమోదైంది. సాధారణంగా ఏటా లక్షల్లో కొత్త ఉద్యోగాలు రావాల్సిన చోట.. ఉన్నవి తగ్గిపోవడం ఐటీ హబ్‌గా హైదరాబాద్ ప్రతిష్టకు సవాలుగా మారింది. ఈ తిరోగమనానికి కేవలం స్థానిక పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో వేలాది మంది అవసరమయ్యే కోడింగ్, టెస్టింగ్ , సపోర్ట్ పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో చేస్తోంది. ఆటోమేషన్ వల్ల కంపెనీలు 'లీన్ మేనేజ్‌మెంట్' తక్కువ మందితో ఎక్కువ పని వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి: అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల ఐటీ ప్రాజెక్టుల బడ్జెట్‌లో కోతలు పడ్డాయి. మన ఐటీ రంగం ప్రధానంగా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. పాత పద్ధతుల్లో సాగే సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్ పనులు తగ్గిపోతున్నాయి. కంపెనీలు కేవలం హై-లెవల్ నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తీసుకుంటున్నాయి, దీనివల్ల కొత్తవారికి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆర్థిక వ్యవస్థపై పడనున్న 'చైన్ ఎఫెక్ట్' ఐటీ రంగం కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు. ఇది ఒక పెద్ద ఎకోసిస్టమ్. ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్, హోటల్ రంగం, రవాణా, రిటైల్ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కోత లేదా వేతనాల స్తబ్దత కొనసాగితే గృహ రుణాలు వినియోగ వస్తువుల విక్రయాలు తగ్గి, నగరం యొక్క మొత్తం ఆర్థిక చక్రం మందగించే ప్రమాదం ఉంది. ముందున్న మార్గం: నైపుణ్యమే ఆయుధం రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఐటీ రంగం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉందన్నది కాదనలేని వాస్తవం. భవిష్యత్తులో కేవలం రొటీన్ పనులు చేసేవారికి చోటు ఉండదు. "పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇది ముగింపు కాదు. జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలలో ఉద్యోగులు త్వరగా నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉంది." అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం ఉన్న కంపెనీలను కాపాడుకోవడమే కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా 'స్కిల్లింగ్ సెంటర్స్' పై దృష్టి పెట్టాలి. ఈ హెచ్చరికను గమనించి అప్రమత్తం కాకపోతే హైదరాబాద్ సాధించిన ఐటీ కీర్తి మసకబారే ప్రమాదం ఉంది.

# మూడు ఫేజ్ లలో డ్రైవింగ్ లైసెన్స్ లు

హైదరాబాద్, మార్చి 25, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న ఎల్ఎల్ఆర్ (ఒఒఖీ), పర్మనెంట్ డ్రైవింగ్ టెస్ట్ అనే రెండంచెల విధానానికి అదనంగా, రాష్ట్ర రవాణా శాఖ ఇకపై ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్ తప్పనిసరి చేయనుంది. ఏప్రిల్ మొదటి వారం నుండి అమలులోకి రానుందని తెలుస్తోంది. తెలంగాణలో ప్రతి ఏడాది సుమారు 7,500 మంది రహదారి ప్రమాదాల్లో చనిపోతుండగా.. వేలాది మంది గాయాల పాలవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా శాఖ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానంపై కసరత్తు చేసింది. ఇది అమల్లోకి వస్తే రహదారి క్రమశిక్షణ పెరిగి ప్రాణనష్టం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు మూడంచెల విధానం

ఈ విధానం ప్రకారం, లెర్నర్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునే ముందే అభ్యర్థులు రహదారి భద్రతపై అవగాహన పరీక్షను పూర్తి చేయాలి. ఇందుకోసం రవాణా శాఖ 6 ప్రత్యేక మాడ్యూళ్లను తయారుచేసింది. ఒక్కో మాడ్యూల్ 30 నిమిషాల చొప్పున మొత్తం 3 గంటల పాటు సాగే ఈ ట్రైనింగ్, ఎగ్జామ్‌ను అభ్యర్థులు ఇంటి నుంచే పూర్తి చేయవచ్చు. కెమెరా ఉన్న కంప్యూటర్, ల్యాప్‌టాప్ ద్వారా ఈ మాడ్యూల్ పూర్తి చేయవచ్చు. ఈ పరీక్షలో క్వాలిఫై అయి పొందే సర్టిఫికేట్ నంబర్ ఉంటేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మీరు అర్హులు అవుతారు. రెండో దశలో లెర్నర్ లైసెన్స్ కోసం పరివాహన్ వెబ్‌సైట్ లేదా లేదా తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ం (మెడికల్ సర్టిఫికేట్)తో ఫిల్ చేయాలి. నిర్వహించే ఆన్ లైన్ ఎగ్జామ్ పాస్ అయితే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మూడో దశలో పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఒఒఖీ వచ్చిన 30 రోజుల తరువాత నుంచి 6 నెలల్లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసి.. ఆర్టీవో ఆఫీసుకు వెళ్లి అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

తెలంగాణలో 3 దశల్లో డ్రైవింగ్ లైసెన్స్.. పూర్తి ప్రక్రియ

డ్రైవింగ్ లైసెన్స్ (ఆఒ) పొందడానికి ఇప్పుడు 3 దశల ప్రక్రియ పూర్తి చేయాలి. ఏప్రిల్ 2026 నుండి ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి. కొత్త డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు ప్రక్రియ స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇదే..

ఫేజ్ 1: ఆన్‌లైన్ రోడ్డు భద్రతా అవగాహన పరీక్ష రాయాలి

ఒఒఖీ దరఖాస్తుకు ముందు 6 మాడ్యూల్స్‌తో కూడిన 3 గంటల ఆన్‌లైన్ క్లాస్ వినాలి. తరువాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేట్ నంబర్ పొందాలి.

ఫేజ్ 2: లెర్నర్ లైసెన్స్ (ఒఒఖీ) కోసం దరఖాస్తు చేయాలి

పరివాహన్ వెబ్‌సైట్ లేదా రాష్ట్ర రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ం (మెడికల్ సర్టిఫికేట్)తో అప్లై చేసుకోవాలి. ఆన్‌లైన్ పరీక్షలో పాస్ అయితే ఒఒఖీ జారీ అవుతుంది.

ఫేజ్ 3: శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (ఆఒ) కోసం దరఖాస్తు

ఒఒఖీ వచ్చిన 30 రోజుల తర్వాత నుంచి 6 నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి. తరువాత ఆర్టీవో (ఖీూ) ఆఫీసు వద్ద డ్రైవింగ్ ట్రాక్‌పై అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరు కావాలి.

వయస్సు: 18 ఏళ్లు నిండి ఉండాలి (గేర్ లేని టూవీలర్‌కు 16 ఏళ్లు).

డాక్యుమెంట్స్: ఆధార్ కార్డ్, అడ్రస్ ప్రూఫ్, వయసు ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

50 ఏళ్లు పైబడిన వారు తప్పనిసరిగా డాక్టర్ నుండి ఫారం 1ం మెడికల్ సర్టిఫికేట్ తెచ్చి సబ్మిట్ చేయాలి.

లైసెన్స్ వ్యాలిడిటీ

ప్రైవేట్ వాహనాలకు అయితే 20 ఏళ్ల వరకు లేదా 50 ఏళ్ల వయస్సు వచ్చే వరకు చెల్లుతుంది. ఆ తర్వాత ప్రతి 5 ఏళ్లకు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

# పేరంట్స్ కోసం...15 శాతం జీతాలు

## రేవంత్ సంచలన నిర్ణయం

హైదరాబాద్, మార్చి 25, కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యతను మరిచి, వారిని రోడ్డున పడేస్తున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక సంచలనం అని చెప్పాలి. పదవి, హోదా ఉన్నా.. కన్నతల్లిదండ్రులకు పట్టెడు అన్నం పెట్టని వారికి ఈ కొత్త చట్టం ఒక గట్టి గుణపాఠం కానుంది. మమకారం కరువైన చోట కనీసం ఆర్థిక భరోసానైనా కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం వేలాది మంది వృద్ధులకు కొండంత అండగా నిలవబోతోంది. ఈ చట్టం వెనుక ఉన్న నిబంధనలు, అది అమలులోకి వచ్చే తీరుపై లోటుగా విశ్లేషణ చేస్తే.. తల్లిదండ్రుల కోసం జీతంలో కోత తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సదరు ఉద్యోగి జీతంలో 15 శాతం లేదా గరిష్టంగా ?10,000 వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, గౌరవంగా బతికే అవకాశం లభిస్తుంది. కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, నేరుగా ఆర్థికపరమైన చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. ఈ వినూత్న నిర్ణయానికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం 'తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్' అనే కొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఈ బిల్లుపై ఈరోజు జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు. అనంతరం ఒకటి రెండు రోజుల్లోనే దీనిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టంగా మలిచే అవకాశముంది. ఒకసారి ఈ చట్టం అమల్లోకి వస్తే, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి, ఆటోమేటిక్‌గా జీతం నుంచి కోత విధించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. నైతిక బాధ్యత చాలా మంది ఉద్యోగులు తమ సొంత ఇల్లు, పిల్లల చదువుల పేరుతో తల్లిదండ్రులను దూరం పెడుతున్నట్లు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం విధులే కాదు, నైతిక బాధ్యతలు కూడా ఉంటాయని ఈ చట్టం గుర్తు చేస్తోంది. ప్రభుత్వం కేవలం జీతాలు ఇవ్వడమే కాకుండా, ఆ జీతంతో కుటుంబంలోని వృద్ధులకు న్యాయం జరుగుతోందా లేదా అన్నది కూడా పర్యవేక్షించనుంది. ఇది సమాజంలో వృద్ధాశ్రమాలకు వెళ్లే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఈ చట్టం కేవలం శిక్షాత్మక చర్యలకే పరిమితం కాకుండా, సమాజంలో ఒక లోతైన మార్పును తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది. కేవలం ఆర్థిక పరమైన అంశాలనే కాకుండా, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొనే సామాజిక వివక్షను అరికట్టడం కూడా ఈ బిల్లులోని అంతర్లీన ఉద్దేశ్యం. ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో ఒక బాధ్యతాయుతమైన వర్గంగా ఉంటారు కాబట్టి, వారి నుంచే ఈ ప్రక్షాళన మొదలవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టం అమలులోకి వస్తే, అది కేవలం ఒక నిబంధనగా కాకుండా, ప్రతి ఇంట్లోనూ కన్నవారి పట్ల ఉండాల్సిన కనీస ధర్మాన్ని గుర్తుచేసే ఒక నైతిక భారంగా మారుతుంది. ఈ చట్టానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు ఇక్కడ ఉన్నాయి: వృద్ధాశ్రమాలకు చెక్ – కుటుంబ వ్యవస్థకు బలం! ప్రస్తుత కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరిగిపోవడానికి ప్రధాన కారణం.. ఆర్థికంగా స్థిరపడిన పిల్లలు తమ తల్లిదండ్రులను భారంగా భావించడమే. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం ఉండే ప్రభుత్వ ఉద్యోగులే తమ వారిని దూరం పెట్టడం అత్యంత విచారకరం. ఈ కొత్త చట్టం ద్వారా, తల్లిదండ్రుల పోషణకు అవసరమైన కనీస మొత్తాన్ని వారి జీతం నుంచే నేరుగా అందించడం వల్ల, వృద్ధులు అనాథాశ్రమాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఇది మన భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయడానికి మరియు వృద్ధులకు ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని ప్రసాదించడానికి ఒక గొప్ప మార్గంగా నిలుస్తుంది. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం! ఈ చట్టం అమలులో భాగంగా, కేవలం నిబంధనలు పెట్టడమే కాకుండా, తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక విభాగాన్ని లేదా కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఒకవేళ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు అందితే, తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో ఒక జవాబుదారీతనాన్ని పెంచడమే కాకుండా, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి సింహస్వప్నంలా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలవనుంది. భయంతోనైనా తల్లిదండ్రులను చూసుకోవడం మొదలుపెడితే, క్రమంగా వారి మధ్య ఉన్న దూరం తగ్గే అవకాశం ఉందని సామాజికవేత్తలు భావిస్తున్నారు. కన్నవారి రుణం తీర్చుకోలేకపోయినా, కనీసం వారికి ఆకలి బాధ లేకుండా చూడటం ప్రతి బిడ్డ కనీస ధర్మం. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం వృద్ధుల కళ్లలో వెలుగు నింపాలని చూస్తోంది.

# కొనసాగుతోన్న మోయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణ

## రోహిత్ రెడ్డిని ప్రశ్నించిన పోలీసులు



హైదరాబాద్ మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితులను సిట్ విచారించింది. రిమాండ్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ డ్డి, అతని సోదరుడు రితీష్ రెడ్డి,ఢిల్లీకి చెందిన రియల్ వ్యాపారి నమిత్ శర్మను చంచల్ గూడ జైలు నుంచి సిట్ అధికారులు కస్టడీకి తీసుకొని బందోబస్తు మధ్య శంషాబాద్ ఠాణాకు తరలించారు. ఉదయం 8 గం టల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు లాయర్ల సమక్షంలోనే ముగ్గురినీ విచారించారు. మొదట రోహిత్ రెడ్డితో ప్రారంభించి,ముగ్గురిని సిట్ బృందం ఆధ్వర్యం లో వేర్వేరుగా విచారించారు. డ్రగ్స్ కొనుగోలు,కాల్పుల వ్యవహారం తదితర అంశాలపై సిట్ అధికారుల బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో వీరందరిని ఫామ్ హౌస్ తీసుకెళ్లి సీన్ రీ కన్స్ట్రక్షన్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం...

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ లో క్రిస్టియన్ లను కలుపుతాం మాజీ ఎంపీ చింతా మోహన్



హైదరాబాద్ 1991 లో గల్ఫ్ యుద్ధం జరిగింది. రాజీవ్ గాంధీ ఉన్నప్పుడు యుద్ధం జరిగింది. రాజీవ్ గాంధీ హయాంలో యుద్ధం జరిగినప్పుడు ఊరికే కూర్చోలేదు మాస్కో వెళ్ళాడు రాజీవ్ గాంధీ. రాజీవ్ గాంధీ గ్యాస్ ధరలు పెరగకుండా చూసుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనందున్న యుద్ధం సమస్య వచ్చిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు.

బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. ధరలు పెరుగుతున్నాయి దీని కారణం దేశ ప్రధాని చేతకాని తనం. నిన్నటి సుప్రీంకోర్టు తీర్పు పై షెడ్యూల్ కులాల(ాఅ) రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు ను ఖండిస్తున్నా. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తి కూడా షెడ్యూల్ కులం(ాఅ) లోకి రారు. వేరే ఏ మతంలోకి మారినా షెడ్యూల్ కుల(ాఅ) హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు తీర్పు ను ఖండిస్తున్నానని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో వచ్చాక ఎస్సీ లో క్రిస్టియన్ లను కలుపుతాం. రాజ్యాంగ సవరణ చేస్తాం. అన్ని మతాలు ఒకటే అని వ్యక్తిగత చెప్తున్నానని అన్నారు.

## టెర్రర్ లింకు కేసు

## దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక బృందాల గాలింపులు

విజయవాడ టెర్రర్ లింకుల కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఇప్పటివరకు మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసారు. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసారు. మిగిలిన నిందితుల కోసం దేశవ్యాప్తంగా తొమ్మిది ప్రత్యేక బృందాల గాలింపు కొనసాగుతోంది.

ఏ4 దిల్షాఖ్ (బిహార్), ఏ5 సయిదా బేగం (హైదరాబాద్), ఏ6 ఆల్ హకీమ్ షుకూర్ (విదేశాల్లో హ్యాండ్లర్), ఏ7 లక్కీ అహమ్మద్ (ఢిల్లీ), ఏ8 అస్మానుల్లా ఖాన్ (బిహార్) లు. × ఏ9 జిషన్ (రాజస్థాన్), ఏ10 మీరా ఆసిఫ్ అలీ (పశ్చిమ బెంగాల్), ఏ11 అబ్దుల్ సలాం (కర్ణాటక), ఏ12 షారక్ ఖాన్ (మహారాష్ట్ర), ఏ13 షేక్ ఫీజర్ రెహమాన్ (మహారాష్ట్ర)ను ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకున్నారు. × నిందితులను స్థానిక పోలీసుల సాయంతో విచారిస్తున్నాయి. .

# ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



హైదరాబాద్ ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలంలోని పాటిఘనాపూర్ విలేజ్ ఆనందనగర్ లేఔట్లో రహదారులు, పార్కులతో పాటు ప్రజావసరాలకు కేటాయించిన స్థలాల ఆక్రమణలను పరిశీలించారు. 1980 వ సంవత్సరం 92 ఎకరాల్లో 1109 ప్లాట్లతో గ్రామపంచాయతీ అనుమతి పొందిన లేఔట్ వేశారు. ఇందులో కొన్ని ప్లాట్లకు ఎల్ ఆర్ ఎస్ కూడా వచ్చింది. ఆనందనగర్ కాలిని పేరిట ఉన్న లేఔట్ హద్దులను చెరిపేసి వ్యవసాయ భూమిగా చిత్రించారు. ధరణి ద్వారా పాస్ బుక్స్ సృష్టించి కబ్జాకి పాల్పడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లేఅవుట్లో ప్లాట్లు ఉన్న బాధితులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆక్రమణలు జరిగిన తీరును కమిషనర్ కు వివరించారు. లే అవుట్ ప్రకారం పార్కులు, రహదారులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

# ఎమ్మెల్యే ధూళిపాల కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు



గుంటూరు గుంటూరులో జరిగిన పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాల నరేంద్ర కుమార్తె వివాహ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సచివాలయ ఉద్యోగి పై దాడి హేయమైన చర్య....

## కఠిన చర్యలకు ఉద్యోగ సంఘాల డిమాండ్...

## కమిషనర్, జిల్లా ఎస్పీ చర్యలు చేపట్టాలి...

## వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్ ల్రాయులు




తిరుపతి: మార్చి 24, తిరుపతి మున్సిపల్ పరిధిలోని 25/1 వార్డు ప్రకాశం రోడ్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అడ్మిన్ సెక్రటరీ నాగార్జున పై దాడి జరిగింది. పన్ను చెల్లించాలని కోరినందుకు స్థానిక సీ ఎన్ ప్రింటర్స్ యజమాని వసంత కుమార్ తన అనుచరులతో కలిసి నాగార్జున పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితుడు నాగార్జున చొక్కా చిరిగిపోవడమే కాకుండా తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగి పై జరిగిన ఈ దాడిని వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చంగల్ రాయులు తీవ్రంగా ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎస్పీలను కోరారు.

## వెస్ట్ బ్రూక్ స్కూల్ ను ప్రారంభించిన మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్

హైదరాబాద్ జీవితంలో అసాధ్యం అనేది లేదని తమ గురువులు నేర్పారు. అది ప్రతి విద్యార్థికి కూడా వర్తిస్తుందని ప్రముఖ సామాజిక వేత్త, మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ సుధారెడ్డి అన్నారు. మాదాపూర్లోని కావూరి హిల్స్ వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన వెస్ట్బ్రుక్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సుధా రెడ్డి ప్రారంభించారు. ప్రతి పిల్ల వాడికి తల్లి మొదటి గురువు, అలాంటి తల్లి హృదయంతో సంజనా ఈ పాఠశాలను వ్యాపారదృ కృథంతో కాకుండా, తల్లిదండ్రుల దృక్పథంతో ప్రారంభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఫౌండర్ సంజనా రెడ్డి మాట్లాడుతూ.. ఒక తల్లిగా తన వ్యక్తిగత అనుభవం నుంచి ఈ పాఠశాల ఆవిర్భవించిందని పేర్కొన్నారు. కార్య క్రమంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# ఏసీల ధరలకు రెక్కలు.. 12 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించిన బ్లూస్టార్

ఎయిర్ కండిషనర్ల(ఏసీ) ధరలకు రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కమోడిటీ ఉత్పత్తులు భగ్గుమనడంతో దేశవ్యాప్తంగా ఏసీ ధరలు భారీగా పెంచుతున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు 10 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించగా.. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ ఏసీల తయారీ సంస్థ బ్లూస్టార్ కూడా చేరింది. కంపెనీకి చెందిన ఏసీల ధరలను 12 శాతం వరకు పెంచుతున్నట్టు కంపెనీ గ్రూపు ప్రెసిడెంట్ మోహిత్ సుద్ తెలిపారు. రాగి, అల్యూమినియంతోపాటు నూతన విద్యుత్ నిబంధనలు అమలు చేయడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఏసీల ధరలను పెంచాల్సి వస్తున్నదన్నారు. దీంతో ఫైవ్-స్టార్ ఏసీలు కనిష్ఠంగా 5 శాతం వరకు గరిష్ఠంగా 15 శాతం వరకు సవరించినట్టు చెప్పారు. జీఎస్టీని 10 శాతానికి తగ్గించడంతో ఏసీల ధరలు దిగొచ్చాయని, కానీ యుద్ధ ప్రభావంతో వీటి ధరలు 15 శాతం పెరగడంతో మొత్తంగా గతేడాదితో పోలిస్తే వీటి ధరలు 5 శాతం వరకు అధికమయ్యాయన్నారు. రాష్ట్ర మార్కెట్లోకి నూతన శ్రేణి రూమ్ 125 రకాల ఏసీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏసీల అమ్మకాలు 5 శాతం పడిపోయే అవకాశాలున్నాయని, ప్రధానంగా ధరలు పెరుగడం, వర్షాభావ పరిస్థితులు కూడా మరో కారణమన్నారు.

# రామాలయం పున:ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్



మంగళగిరి: మంగళగిరి పట్టణం కొప్పురావుకాలనీలో నూతనంగా రామాలయ పున:ప్రతిష్ట మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య హనుమత్ లక్ష్మణ సీతాసమేత రాముల వారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం స్వామివార్లను దర్శించుకుని మంత్రి లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం పునర్ నిర్మాణానికి మంత్రి లోకేష్ రూ.5 లక్షల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం....



ప్రకాశం దొనకొండ మండలంలోని "రైతన్న మీకోసం కార్యక్రమం" అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో టీం సభ్యులు అయినటువంటి పశుసంవర్ధక సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి,ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, పిఎసిఎస్, మార్కెటింగ్ అధికారులు, నీటి సంఘం సభ్యులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరందరూ ప్రతి రైతు కుటుంబాన్ని కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని అందించి రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు 5 విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దొనకొండ మండల వ్యవసాయ అధికారి వి. బాలకృష్ణ నాయక్ ఆరవల్లిపాడు, వద్దిపాడు, పడమటి వెంకటాపురం గ్రామాలలో జరుగుతున్నటువంటి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతన్న మీకోసం 6 రోజుల వారోత్సవాలలో (16-03-2026 నుండి 18-03-2026 వరకు మరియు 23-03-2026 నుండి 25-03-2026 వరకు) భాగంగా జరగబోవు రైతన్న మీకోసం రైతు కుటుంబాల సర్వేని గ్రామ వ్యవసాయ సహాయకులు సమర్థవంతంగా నిర్వహించి, ఈ కార్యక్రమం యొక్క 5 విధానాల కార్యాచరణ అయినటువంటి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి రైతన్నకు పెట్టుబడి సాయం తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి తగ్గించి అధిక లాభం పొందే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించాలని తెలియజేశారు. పాడి రైతులకు కూడా సాంకేతిక సలహాలు అందించి వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉన్నటువంటి గ్రామ వ్యవసాయ సహాయకులు " ఏపీ ఎయిమ్స్" యాప్ వలన కలిగే ప్రయోజనాలను గురించి మరియు క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు గురించి రైతులకు వివరించాలని, ఇంకా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోకుండా మిగిలి ఉన్న రైతులను గుర్తించి పూర్తిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మణ్, సురేంద్ర, వీరాంజనేయులు, కమల, విన్ని బాబు మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# దేవరలో అపశృతి




సి. బెలగల్ మార్చి 24 మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామంలో శ్రీ సుంకుల పరమేశ్వరి దేవరలో అపశృతి జరిగింది. గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న వేళ్ల మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గ్రామానికి చెందిన కురువ శివ 28 సం, గుండెపోటుకు గురై అకస్మికంగా మృతి చెందారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కురువ గువ్వల ఈరన్న, నాగమ్మల మూడవ సంతానం శివ. మృతునికి 8 సంవత్సరాల క్రితం కోసిగి మండలం సాతనూరు గ్రామానికి చెందిన మల్లేశ్వరి తో వివాహం జరిగింది. మృతుడు మంగళవారం గ్రామంలో జరుగుతున్న సుంకుల పరమేశ్వరి దేవర లో పాల్గొని సాయంత్రం బంధువుల సమక్షంలో మంచి చెడులు మాట్లాడు కొనిచుండగా అకస్మాత్తుగా ఒక్కసారి గుండెపోటుకు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రధమ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతునికి భార్యతోపాటు ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు. దీంతో గ్రామంలో జరుగుతున్న దేవరలో వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలో అలముకున్నాయి.

# మేము వైయస్ జగన్ విశ్వాస పాత్రులం...
# మమ్ములను కుక్కలతో పోల్చిన సంతోషమే.

**జగన్ కు దమ్ము, ధైర్యం లేక కాదు మానవత్వం ఉండబట్టే జవాబు ఇవ్వలేదు**

**మేము సైతాన్ సైన్యం కాదు, జగనన్న సైన్యం అందుకే వాస్తవాలను ధైర్యంగా మాట్లాడుతున్నానీ.**

**.వైయస్ అవినాష్,రాచమల్లు ల వ్యాఖ్యల కు జవాబు చెప్పలేకే అసందర్భంగా ప్రేలాపనలు.**

**పీసీసీ చీఫ్ షర్మిలమ్మ పై వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యనీ ఫైర్.**



కడప వైఎస్ విజయమ్మ తల్లిగా వైఎస్ జగన్ తో మాట్లాడే చనువు,బాధ్యత ఉన్నప్పటికీ మాట్లాడకుండా జగన్ రాజకీయ పతనాన్ని కోరి ... షర్మిలమ్మను రక్షించేందుకు మద్దతుగా విజయమ్మ స్టేట్మెంట్ కు నోటరీ చేసి విడుదల చేయడం కూటమినేతల కుట్రలో భాగమని,ఉన్న వాస్తవాలను వైయస్ జగన్ విశ్వాస పాత్రులనీగా వైఎస్ కుటుంబ కీర్తి మసకబారకూడదనే సదుద్దేశంతో మేము మాట్లాడామని అలాంటి మమ్ములను కుక్కలు మొరుగుతున్నాయి అంటూ విశ్వాసానికి మారు పేరైన కుక్కలతో పోల్చడం సంతోషదాయకమే గానీ మిలాంటి చెల్లెళ్లతో పోల్చకపోవడం అత్యంత సంతోషదాయకమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి పిసిసి చీఫ్ షర్మిలమ్మ పై ఫైర్ అయ్యారు. దువ్వూరు మండలం,గుడిపాడు గ్రామంలోని దువ్వూరు సింగల్ విండో మాజీ చైర్మన్ తుమ్మల మస్తాన్ రెడ్డి స్వగృహంలో మంగళవారం రెడ్యనీ విలేకరులతో మాట్లాడుతూ పిసిసి చీఫ్ షర్మిలమ్మ విజయవాడలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నిస్సిగ్గుగా అబద్దాలను నీచ,నికృష్ట భాషతో మాట్లాడటం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు.తండ్రి చనిపోయినా ఆస్తి లో తన చెల్లెలు కి వాటా ఇచ్చే అన్నదమ్ములు ఉంటారని,తన సొంత ఆస్తిలో వాటా ఇచ్చే ఏకైక అన్న వైఎస్ జగన్ మాత్రమే కానీ... షర్మిలమ్మకు జగన్ సొంత వాటా ఇచ్చినా ధన దాహం... ఆస్తి దాహం తీర లేదని,షర్మిలమ్మ, ఆమెకు అండగా విజయమ్మ ఇష్టం వచ్చినట్లు గ్లోబెల్స్ మించి వైయస్ జగన్ పై విష ప్రచారం చేయడం,అబద్దాలను శత్రువులకు మించి మాట్లాడినా వారిపై మానవత్వం,ప్రేమ, అభిమానం ఉండబట్టే జగన్ వారికి జవాబు ఇవ్వడం లేదని, దమ్ము,ధైర్యం లేక కాదన్న నగ్న సత్యాన్ని గుర్తించి మసులుకోవాలని వారికి ఆయన వారికి హితవు పలికారు. మీరు వైయస్ జగన్ పైనే కాకుండా... వాస్తవాలు మాట్లాడే మాలాంటి వారిని సైతాన్ తో పోల్చడం సిగ్గుచేటని మేము సైతాన్ సైన్యం కాదని,జగనన్న సైన్యం కాబట్టే వాస్తవాలను నిర్భయంగా, నీతి,నిజాయితీ తో మాట్లాడుతున్నామని ఆయన పేర్కొన్నారు. వివేక హత్యపై జగన్, వైయస్ భారతి లు నిజం ఏమిటో చెప్పాలని షర్మిలమ్మ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని,దీనిపై నిజమేమిటో డా॥ నర్రెడ్డి సునీతమ్మ ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి లు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. నలుగురు మనమల్లు,మనమరాల్లకు ఆస్తిని సమానంగా పంచాలని డా॥వైయస్ రాజశేఖర్ రెడ్డి చెప్పినట్లు విజయమ్మ దేవుడు సాక్షిగా ప్రస్తావించారని షర్మిలమ్మ వెలువరించడం దుర్మార్గమని,ఆ వాటా వైయస్ఆర్ ఉన్నప్పుడే పంచారని...షర్మిలమ్మ బ్లాక్ మెయిల్ తోనే విజయమ్మ లాంటి గొప్ప మహిళలతో అబద్ధాలు ఆడిస్తోందని ఆయన నిశితంగా విమర్శించారు. వివేక మరణం పై సాక్షి చానల్లో గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేశారని పదే పదే చెప్పే సునీతమ్మ,షర్మిలమ్మ లు ఆనాడు ఏబిఎన్ లో తన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూసిన వైయస్ వివేకా అని,ఈటీవీలో వైయస్ జగన్ చిన్నాన్న వైయస్ వివేకనంద రెడ్డి హఠాన్మరణం అంటూ చేసిన ప్రచారాలపై ఎందుకు నిలదీయరని? ఎందుకు ప్రశ్నించరని? ఆయన సూటిగా ప్రశ్నించారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి ,ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యుడు,వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలపై షర్మిలమ్మ జవాబు ఇవ్వలేక అసందర్భం ప్రేలాపనలు, అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుపడ్డారు.నందమూరి బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిపినా,నారా రామమూర్తి నాయుడు తన అన్న చంద్రబాబు నాయుడు పై పోటీకి సై అన్నా,ఎన్టీఆర్ పై కుటుంబ సభ్యులంతా తిరుగుబాటు చేసినా... చెప్పులు వేయించినా,నందమూరి హరికృష్ణ సొంత పార్టీ పెట్టినా, ఎన్టీఆర్ కుమార్తె ఆత్మహత్య చేసుకుని మరణించినా అవి వారి సొంత సమస్యలని నాడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గానీ,నేడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గానీ ఏనాడు నోరు మెదపలేదని నేడు జగన్ కుటుంబం ఆస్తి గొడవల్లో ఎల్లో మీడియా ఛానల్లు కూటమినేతల ప్రమేయంతో తలదూరుస్తూ,విషం చిమ్ముతున్నారని వారి కుటుంబ సమస్యలు వారు వారు తేల్చుకుంటారని మధ్యలో మీకెందుకని ఆయన నిలదీశారు.ఏనాటికైనా వాస్తవాలు బయట పడతాయని...నిజం నిప్పు లాంటిదని ఆయన పేర్కొంటూ వైయస్ జగన్ ఎప్పటికైనా కడిగిన ముత్యంలా ప్రజల గుర్తిస్తారని... జగన్ విజయాన్ని ఎవరు ఆపలేరని.. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత వాస్తవమో తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావడం అంతే వాస్తవం అని రెడ్యనీ విశదీకరించారు.విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్సిపి నేతలు గుడిపాడు సర్పంచ్ రాజుపాలెం మాబు షరీఫ్, కమ్మర సుబ్బనాచారి, ఎర్రగుంట్ల నాగమోహన్ రెడ్డి, ఇచ్చు కత్తుల మహమ్మద్ గౌస్ లు పాల్గొన్నారు.

# బ్రహ్మాం స్వామి మాల ధారణ వేసిన స్వాములకు
# వస్త్రాలు, మాలలు పంపిణీ




బ్రహ్మంగారిమఠం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం నందు మహా నివేదిన మందిరంలో మఠం మఠాధిపతులు పూజ్యశ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాల వస్త్రాలు, పూజా సామాగ్రి, అందించి అనంతరం స్వామివారు వారికి మాల ధారణ చేశారు. మాల ధారణ వేసుకున్న స్వాములందరూ కూడా స్వామివారి మూలమంత్రాన్ని అనునిత్యం జపిస్తూ ఉండాలని మరియు మాలాధారణకు సంబంధించిన నియమ నిష్టల గురించి స్వామి వారు మాల ధారణ చేసుకున్న వారికి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో స్వామివారి మాలావస్త్రాలు పూజా సామాగ్రి ఉచితంగా అందించిన వారుకోనేటి వీర నాగరాజు పసుపులేటి వెంకటసుబ్బయ్య

# వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కోవద్దు

**ఇంధనం గురించి భయపడాల్సిన అవసరంలేదు...**

**కుషాయిగూడ ట్రాఫిక్ సీఐ ఆర్ ఎల్ ఎన్ రాజు**

కుషాయిగూడ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దు ఇంధన కొరత అంటూ వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి వాహన దారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకుల మీదకు వచ్చి బారులు తీరుతూ ఇబ్బందులు ఎదుర్కోవద్దు అని ట్రాఫిక్ సీఐ ఆర్ ఎల్ ఎన్ రాజు వాహన దారులకు తెలిపారు. రోడ్లపైకి ఒక్కసారిగా రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయంతో పాటు వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కోవడం పట్ల స్పందిస్తూ పెట్రోల్ బంకుల వద్ద నుండి రోడ్లపై వరకు బారులు తీరుతున్నారని ఇంధన కొరత ఏమాత్రం ఉండబోదని అన్నారు.

# అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం.
# రూ 2 లక్షల ఆస్తి నష్టం.



రుద్రవరం. మండలంలోని హరినగరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో గుడిసె దట్టమయింది. గ్రామస్తుల వివరాల మేరకుగ్రామానికి చెందిన భేతి కనకమ్మ ఇంటిలో తెల్లవారుజామున హఠాత్తుగా మంటలు వ్యాపించి గుడిసెపూర్తిగ దగ్ధమైందన్నారు. ఈ ప్రమాదంలో వంట సామాగ్రి, దుస్తులు, ధాన్యం, టీవీ, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి అన్నారు. ప్రమాదంలో దాదాపు 2 లక్షల దాకా నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇంటిలో మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు సకాలంలో స్పందించి మంటలను ఆర్పీ వేశారు. కాలిన గుడిసెను విఆర్ఓ పుల్లయ్య పరిశీలించారు. నష్టం వివరాలను నివేదిక గా తయారుచేసిరెవెన్యూ అధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి
## కార్యకర్తల సమక్షంలో ప్రకటన



జగిత్యాల కాంగ్రెస్ సినీయర్ నేత జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసారు. పార్టీ ఫిరాయింపులు మంచిది కాదని చెప్పినా వినిపించుకోలేదు, జగిత్యాలలో ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినా వినలేదు. నేను, నా కార్యకర్తలు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నామని అయన ఆరోపించారు. తీవ్రమైన బాధతో పార్టీని వీడుతున్నాను.. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలతో ఆయన సొంత పార్లమెంట్ మహబూబ్ నగర్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. చేవెళ్ల ఎంపీ స్థానానికి తొలుత సునీతా మహేందర్ రెడ్డిని అభ్యర్థిగా నిర్ణయించి తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుండి రంజిత్ రెడ్డిని తెచ్చి అతనికి ఇచ్చారు. దాని ప్రభావం సీఎం రేవంత్ రెడ్డి సొంత పార్లమెంట్ స్థానం మహబూబ్ నగర్ అలానే చేవెళ్ల, సికింద్రాబాద్ సీట్లు కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని అయన అన్నారు.

# వృద్ధ తల్లిదండ్రులను సరిగా చూసుకోని
# కొడుకులకు కౌన్సిలింగ్



సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ టి. లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట త్రీ టౌన్ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పాముకుంటా నర్సయ్య- ఎల్లవ్వ దంపతులు తమ ముగ్గురు కుమారులు యాదగిరి, కిష్టయ్య, దేవయ్యలకు తమ కష్టార్జిత ఆస్తులను సమానంగా పంచి ఇచ్చినప్పటికీ, సరైన పోషణ పొందడం లేదని 18-03-2026 న సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై స్పందించిన సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టాటా లక్ష్మీబాబు. ముగ్గురు కుమారులు మరియు వారి భార్యలను పోలీస్ స్టేషన్కు పిలిపించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. సమాజంలో వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ ప్రతి కుమారుని ప్రాథమిక బాధ్యత అని, తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వారిని వృద్ధాప్యంలో ఆదరించడం, పోషణ ఇవ్వడం, ఆరోగ్య సంరక్షణ చూడడం కుమారుల కర్తవ్యమని వివరించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం నైతికంగా తప్పే కాకుండా చట్టపరంగాను శిక్ష అర్హులని హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం కుమారులు తమ తల్లిదండ్రులను ఇకపై సక్రమంగా చూసుకుంటామని, ప్రతి నెల ఖర్చులకు సరైన డబ్బులను అందిస్తామని, అలాగే ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు అందరూ కలిసి వైద్యసహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా స్టేషన్ ఇన్స్పెక్టర్ టాటా లక్ష్మీబాబు మాట్లాడుతూ. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రశ్మి పెరుమాళ్ వృద్ధుల గురించి ప్రత్యేక దృష్టి సారించినందున వృద్ధులైన తల్లిదండ్రులను సరిగా చూసుకోని కొడుకుల గురించి ఫిర్యాదు చేస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహించబడునని, వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణ మన సంస్కృతిలో భాగమని, ప్రతి కుటుంబం దీనిని కచ్చితంగా పాటించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి ఖమ్మంపల్లి గ్రామానికి స్వయంగా వెళ్లి వృద్ధ దంపతుల పరిస్థితిని పరిశీలిస్తానని తెల్పినారు. ఇన్స్పెక్టర్ జోక్యంతో కుటుంబ వివాదం సఖ్యతగా పరిష్కారమవడంతో వృద్ధ దంపతులు పాముకుంటా నర్సయ్య-ఎల్లవ్వలు పోలీసుల సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## రాష్ట్ర బడ్జెట్లో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పీట
## కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి** మార్చి 25 ఏటూరు నాగారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మహిళ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉంది 28 నెలల కాలంలో అభివృద్ధికి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది మూడవసారి ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని వర్గాల ప్రజలకు సమచిత న్యాయము స్థానము కల్పిస్తూ రాష్ట్ర సంక్షేమానికై కొత్త దిశను చూపించిందని అన్నారు.

ఐదు లక్షల రూపాయల ఇందిరమ్మ జీవిత బీమా ప్రజలందరికీ న్యాయం జరిగే విధంగా ఉందని అద్భుతమైన ఆలోచన అని అన్నారు.

నిరుద్యోగుల సమస్యలను గుర్తించి తక్షణమే 65 వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో అందించడం జరిగిందని మళ్లీ నిరుద్యోగుల కోసం మరిన్ని అవకాశాలు సృష్టించే విధంగా ప్రభుత్వము చర్యలు తీసుకుంటుందని అన్నారు అదేవిధంగా గత 10 సంవత్సరాలలో దీ=పా ప్రభుత్వం చెయ్యని గ్రూప్ వన్ గ్రూప్ టూ గ్రూప్ త్రీ గ్రూప్ ఫోర్ నియామకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి నిరుద్యోగుల జీవితాలలో వెలుగు నింపారని అన్నారు

అదేవిధంగారైతు సంక్షేమానికై పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వరి ధాన్యానికి కింటకు 500 రూపాయల బోనస్ కల్పించి రైతు భరోసా కింద ఎకరానికి 6000 రూపాయలు మంజూరు చేసింది. గత పది సంవత్సరాలు పరిపాలన చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసిందని అట్టి అప్పులకు వడ్డీలనుకాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వము ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజల ఆశీస్సులతో ముందుకు తీసుకుపోతుందని అన్నారు

# ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

## సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూరు పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల 100 ఎకరాల తోటను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉద్యాన నర్సరీల బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రాజంపేట లో ఉద్యాన నర్సరీలను అధికారులు ఆకస్మికంగా సందర్శించాలని తెలిపారు.ఈ సంవత్సరం ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బ్యాంబు (వెదురు) మిషన్ లో భాగంగా 2 కోట్ల రూపాయల నిధులతో నర్సరీలలో మొక్కల పెంపకంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.రైతులకు అవసరమైన మొక్కలను నాణ్యత ప్రమాణాలు పాటించి తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతామని, మామిడి,వెదురుతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పట్లూర్ రైతు వేదికలో వార్డు సభ్యుల ఓరంటేషన్లో పాల్గొన్న ఎంపీడీవో మరియు ఎంఈఓ



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 25 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా :** మర్పల్లి మండలం మర్పల్లి మరియు పట్లూర్, రైతు వేదికలో నూతనంగా గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా ఎన్నికైన సభ్యులకు పట్లూర్ రైతు వేదికలో ఐదు రోజుల ఓరంటేషన్ శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్న ఎంపీడీవో మరియు ఎంఈఓ గ్రామ అభివృద్ధి గురించి గ్రామ సంక్షేమం గురించి పరిసరాల పరిశు భ్రత గురించి గ్రామపంచాయతీ నిధుల గురించి గ్రామపంచాయతీ పనితీరు గురించి గ్రామ అభివృద్ధి గురించి సూచనలు సలహాలు ఇస్తూ గ్రామ పంచాయతీకి సంబంధించిన హక్కులు ఆర్టికల్ సెక్షన్స్ గురించివివరిస్తూ వార్డు సభ్యులను చైతన్యవంతులుగా చేస్తూ వారి విధులు బాధ్యతలను గుర్తు చేస్తూ ఓరెంటేషన్లో కేవలం విద్య వైద్య ఆరోగ్య పరిసరాలు పరిశుభ్రత మౌలిక సదుపాయాలు గ్రామ అభివృద్ధి గురించి వార్డు సభ్యులుగా ఎన్నికైన ప్రజలకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ బి అశోక్, స్పెషల్ ఆఫీసర్స్, వివిధ గ్రామాల గ్రామ సెక్రెటరీలు గ్రామాలలో వార్డు సభ్యులుగా ఎన్నికైన వార్డు సభ్యులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు



# హజ్ యాత్రికులకు వాక్సినేషన్ ప్రారంభం...

## హజ్ కు ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా వెళ్లాలి....



నాగర్ కర్నూల్ జిల్లా నుండి హజ్ కు వెళ్తున్న యాత్రికుల కోసం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ టి.ఉషా రాణి యాత్రికులకు వాక్సినేషన్ డ్రాప్స్ వేసి ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రత్యేకంగా వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి వ్యాక్సినేషన్ చేశారు. హజ్ యాత్రకు వెళ్తున్న ప్రతి భక్తునికి ఆరోగ్యంగా ఉండేలా ఆరోగ్య శాఖ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ విభాగాధిపతి డాక్టర్ సూర్యనారాయణ యాత్రికులను ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలుచేశారు. అనంతరం వారికి ప్రత్యేక వ్యాక్సిన్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ సురేష్ బాబు,నాగర్ కర్నూల్ హజ్ కమిటీ సభ్యులు షేక్ ఫరీద్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజీమ్, డాక్టర్ ప్రశాంత్, పి.పి.యూనిట్ వైద్యాధికారి డాక్టర్ పి. సృజన,ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, మహిళ ఆరోగ్య కార్యకర్త సరస్వతి,ఆరోగ్య సిబ్బంది నవీన, సుకుమార్ రెడ్డి,వై. శ్రీనివాసులు,హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి.యాదగిరి, గంగా,కుమార్, వనిత, కిషన్,దివ్య ,హజ్ యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.



# ఏఎన్ఎం నిరంజనమ్మ ను సన్మానించిన బొప్పెల్లి సర్పంచ్.బృందం




రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబరిన ఆలేరు ఏఎన్ఎం నిరంజనమ్మ ను బుధవారం తెలకపల్లి మండల పరిధిలోని బొప్పెల్లి సర్పంచ్ మహేశ్వరం నవ్య మల్లాచారి.గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల తో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన మహిళా నిరంజనమ్మ ఈనెల 15న హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబర్చండం చాలా సంతోషంగా ఉందని ఇలాంటి మరెన్నో పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చాలని ఆమే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గౌరారం రాజు వార్డు సభ్యులు శ్రీను .సురేష్.అనిత.సప్న గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ డాక్టర్ నాగేశ్వరీ.నర్మద సూపర్ వైజర్లు రవిందర్ రెడ్డి.సరళ ఎం ఎల్ హెచ్ పి లు మమత రామాంజనేయులు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

## వారంలో రెండు రోజులు సేవలు అందుబాటులో

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల జిల్లా/ఎల్లారెడ్డిపేట, మార్చి -25 (ప్రజాబలం ప్రతినిధి)**దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. భవిత కేంద్రం పరిధిలో మొత్తం ఎందరు దివ్యాంగులు ఉన్నారు? ఏ ఏ సేవలు వారికి అందిస్తారో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..



ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దీని సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం, గురువారం ఐఈఆర్పీ, ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అనంతరం మండల సమాఖ్య భవనాన్ని పరిశీలించి, ఎందరు సభ్యులు ఉన్నారని, స్వయం ఉపాధి, సంఘాల ఆర్థిక కార్యకలాపాలపైన ఆరా తీశారు. అక్కడి నుంచి జూనియర్ కళాశాల మైదానంలో పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.



# మద్యం సేవించి పట్టుబడితే జైలు పాలే , 84 మందికి జరిమానాలు విధించిన కోర్టు



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ మార్చి -25** వేములవాడ పట్టణంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 84 మందిని బుధవారం పోలీసులు కోర్టులో హాజరుపరచగా 17 మందికి 5000రూపాయలు, 21 మందికి 4000 రూపాయలు, 46 మందికి 2000 చొప్పున ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మందుబాబులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి ఇకపై మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై రోజూ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రామ్మోహన్ గౌడ్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సముద్రాల రాజు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారులపై జంట నగరాల్లో నెలకొన్న ఇంధన సెగ ప్రభావం

## విజయవాడ నేషనల్ హైవేపై ఉన్న పెట్రోల్ బంకుల వద్ద భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు



హైదరాబాద్ మార్చ్ 25జంట నగరాల్లో నెలకొన్న ఇంధన సెగ ప్రభావం కేవలం నగరం లోపలే కాకుండా ప్రధాన రహదారులపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ టు విజయవాడ నేషనల్ హైవేపై ఉన్న పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. బంకుల వద్ద వాహనాల క్యూలైన్లు ప్రధాన రోడ్లపైకి రావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లో ఇంధన కొరత లేదని, ఆయిల్ కంపెనీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని అధికారులు పదేపదే స్పష్టం చేస్తున్నప్పటికీ, ప్రజల్లో నెలకొన్న సందేహాల కారణంగా బంకుల వద్ద ఈ రద్దీ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం పలు మెట్రో నగరాల్లోని పలు బంక్‌ల్లో

## వికారాబాద్,మార్చి 28న జాతీయ లోక్ అదాలత్,కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి, జిల్లా ఎస్పీస్నేహ మెహ్రా



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 25(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సులభంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, 2026 మార్చి 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు ఒక గొప్ప అవకాశమని తెలిపారు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలు ఈ వేదిక ద్వారా లభిస్తుందని ఆమె పేర్కొన్నారు,

లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు మరియు కుటుంబ సమస్యలు వంటి అనేక అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు, దీని ద్వారా ప్రజలు కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమయం మరియు వ్యయం రెండూ ఆదా అవుతాయని వివరించారు,లోక్ అదాలత్ అనేది శాంతియుత, రాజీ మార్గంలో జరిగే పరిష్కార ప్రక్రియ కావడంతో, ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు,

ఈ విధానం ద్వారా కోర్టు కేసులు త్వరగా ముగిసి, ప్రజల మధ్య మంచి వాతావరణం ఏర్పడుతుందని ఆమె ఆకాంక్షించారు. న్యాయం త్వరగా అందించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని, కావున పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ,కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని తమ సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు,

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) మ్యాపింగ్ ప్రక్రియకు సహకారం అందించాలి. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు జిల్లా. ప్రతినిధి** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో ములుగు నియోజకవర్గంకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ

జిల్లాలో 72.47 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తిచేయాలంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు జాబితాలను అందించని రాజకీయ పార్టీల ప్రతినిధులు తక్షణమే అందించాలని ఆదేశించారు.

అలాగే ఎస్.ఐ.ఆర్. ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రాజకీయ పార్టీలు పాల్గొనాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం ఇంచార్జి సూపరింటెండెంట్ సలీం, డి టి నితీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 10 నెలల పసికందుకు అరుదైన శాస్త్ర చికిత్స




**ఖమ్మం ప్రతినిధి మార్చి 25 (ప్రజాబలం)** ఖమ్మం ప్రాంతానికి చెందిన 10 నెలల బాబు ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న తరుణంలో ఆ బాబు తల్లిదండ్రులు హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ ను సంప్రదించంగా అక్కడ వైద్య బృందం అరుదైన శాస్త్ర చికిత్స అందించి వైద్యులు అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారని ఖమ్మం యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ కుమార్ వెల్లడించారు . ఇది వారసత్వంగా వచ్చే అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే అరుదైన ఎముక మజ్జ వ్యాధి గతేడాది డిసెంబర్ 26న సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమె గాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లు మరియు ప్లేట్లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు శస్త్రచికిత్స పూర్తిచేసుకున్న చిన్నారితో వైద్య బృందం నిర్ధారణ అయిందని ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా , రక్తస్రావం , ప్రమాదంతో కూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించి తండ్రి మూల కణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించారు బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించుకున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు బాల కృష్ణ నాగార్జున పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉద్యోగులారా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించండి.

### బీ.ఆర్.ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం.
### వికలాంగ వ్యాపారిపై లక్ష్యంగా చర్యలు.
### ప్రభుత్వ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన.




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 25 మార్చి 2026**ప్రజలతో ప్రజల కొరకు బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ ల స్థానిక నాయకులు తలపెట్టిన కార్యక్రమములో గుర్తించిన విశేషాలు: మునిసిపల్ అధికారులు పరిపాలన వ్యవస్థ పక్షపాతముగా, వివక్షతో వ్యవహరిస్తున్నట్లు గమనించడం అత్యంత ఆందోళనకరం. గతంలో మణికొండ మున్సిపాలిటీ కమిషనర్, ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ప్రభుత్వ ఉద్యోగులుగా అవసరమైన తటస్థతను పాటించకుండా వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణలు: బీ.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రాష్ట్ర స్థాయి నాయకుల ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలను అత్యంత వేగంగా తొలగించడం, అందుకు విరుద్ధముగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీల విషయంలో ఆ ఉత్సాహం కనిపించడం లేదు. బీ.ఆర్.ఎస్ పార్టీ వీధి వ్యాపారులకు మద్దతు ఇవ్వడంతో, ప్రతీకార భావంతో ఒక వికలాంగుడి దుకాణాన్ని మాత్రమే కూల్చి వేయడం జరిగింది. పక్కనే ఉన్న ఇతర దుకాణాలను మాత్రం వదిలి వేయడం జరిగింది. ఇది న్యాయ సమ్మతం కాని, మానవత్వానికి విరుద్ధమైన చర్య. ఇటీవల అమృత్ పథకం కింద నెక్కనంపూర్ చిన్న చెరువు ఎస్.టీ.పీ పనులు ప్రారంభించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే లు హాజరు కాకున్నను, ప్రస్తుతం ఎలాంటి అధికారిక ప్రోటోకాల్ హోదా లేని స్థానిక కాంగ్రెస్ నాయకులకు పెద్ద పీట వేసి కార్యక్రమాన్ని, ఫోటో సెషన్‌ను డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించారని సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులు తటస్థంగా వ్యవహరించడం వారి ప్రధాన బాధ్యత కాగా ఇట్టి చర్యలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారని స్పష్ట మవుతోన్నది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికైనా రాజకీయాల్లో పాల్గొనాలను కుంటే, తమ పదవులను విడిచి రాజకీయ దారిని ఎంచుకోవచ్చు. కానీ ప్రభుత్వ అధికారులుగ ఉండి ఒక పార్టీకి కొమ్ము కాయడం, మద్దతు ఇవ్వడం ప్రజాస్వామ్య పద్ధతికి గొడ్డలి పెట్టని బి.ఆర్.ఎస్ పార్టీ స్థానిక నాయకులు తమ అభిప్రాయాన్ని తెలుపుతూ అందుకు విరుద్ధముగ పక్షపాత పరిపాలనను ఇలాగే కొనసాగిస్తే బీ.ఆర్.ఎస్ పార్టీ ప్రజా స్వామ్య పద్ధతుల్లో నిరసనలు వ్యక్తం చేయడానికి తప్ప వేరే మార్గం ఉండదు. అట్టి పరిణామాలకు పూర్తి బాధ్యత సంబంధిత అధికారుల పైనే ఉంటుందనీ బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, భాను చందర్, మాల్యాద్రి నాయుడు, రాజేంద్ర ప్రసాద్, సుమనళిని, రఫీక్, నూకల మంజు తదితరులు ముక్త కంఠంతో హెచ్చరిస్తున్నారు.

## కాచారం గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించినందుకు ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు




**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి మార్చి 25** యాదగిరిగుట్ట మండలంలో కాచారం గ్రామానికి గత కొన్ని నెలల నుండి బస్సు సౌకర్యం అంతరాయం ఏర్పడడంతో కాచారం మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణ రామ్ రెడ్డి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య ను కలసి యాదగిరి గుట్ట వయ కాచారం మీదుగా సిద్దిపేట వెళ్లే బస్సు రాకపోవడంతో విషయాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే స్పందించి డిఎం కు ఆదేశాలు ఇవ్వడంతో ఈరోజు కాచారం గ్రామానికి ఉదయం 9 గంటలకు యాదగిరిగుట్ట వయా కాచారం సిద్దిపేట వెళ్లే బస్సు యధావిధిగా కొనసాగించినందుకు ప్రయాణికులు కాచారం ప్రజలు కార్యకర్తలు ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణ రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దడిగే ఇస్తారు వార్డ్ మెంబర్లు బీబీనగర్ ప్రమీల రాజయ్య సుంచు నవీన్ మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ ఒగ్గు లలిత మల్లయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బోశీదుగుల శకుంతల దేవి బెజాడు శ్రీశైలం ఉప్ప శ్రీరాములు వగ్గు రాజయ్య తదితరులు పాల్గొని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కు కృతజ్ఞతలు తెలిపినారు

## అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గీతం తప్పనిసరి కాదు : సుప్రీంకోర్టు



న్యూ డిల్లీ మార్చ్ 25 : ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం పాడాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే ఆ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప తప్పనిసరి కాదని స్పష్టంచేసింది.ప్రభుత్వ ఉత్తర్వులలో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని కోర్టు అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొన్నది.ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దాన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తామని, ప్రస్తుతానికి దానిలో అలాంటివేమీ లేవని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే.. సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని వాదించారు.దేశభక్తిని బలవంతంగా రుద్దలేరని, వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉందని ఆయన నివేదించారు. అయితే పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో పేర్కొన్నది.అయితే ఆ సర్క్యులర్ కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించారు. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రాసిన ఈ గేయం.. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు.ఈ గేయానికి 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ జాతీయ గేయం హోదా కల్పించారు.

## ఇంధన కొరత ఉందనేది కేవలం తప్పుడు సమాచారం

వికారాబాద్ ఇంధన కొరత ఉందనేది కేవలం తప్పుడు సమాచారం. దీనివల్ల ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఇందన కంపెనీల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయి. సప్లై చెయిన్ ఎక్కడా ఆగలేదని పెట్రోల్ బంకుల ప్రతినిధుల సంఘం అంటోంది. భయం వల్ల ప్రజలు ఒక్కసారిగా కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 2.5 నుండి 3 రెట్లు విక్రయాలు పెరిగాయి. దీనివల్ల కొన్ని బంకుల్లో తాత్కాలికంగా స్టాక్ అయిపోవచ్చు, కానీ అది కొరత కాదు. పెట్రోల్ లేదా డీజిల్ను డబ్బాల్లో, క్యాన్లలో నింపి నిల్వ చేయడం పెసో నిబంధనలకు విరుద్ధం. ఇది చాలా ప్రమాదకరం మరియు అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చు. ప్రజలు తమకు అవసరమైనంత మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని అసోసియేషన్ కోరింది. తప్పుడు వార్తలను నమ్మకండి లేదా ప్రచారం చేయకండి. బాధ్యతాయుతంగా వ్యవహరించండి అని పలు పెట్రోల్ బంక్ యజమానులు పెలిపారు.

### పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా అవాస్తవం

ముంబాయి భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా అవాస్తవం. భారత్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.. దేశమంతా ఇంధన సరఫరా జరుగుతోంది. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తుంది.. ఆందోళన అవసరం లేదని స్పష్టతనిచ్చింది.

# ఎలక్ట్రానిక్ మీడియా & ప్రింట్ జర్నలిస్టులకు ఆహ్వానం



హైదరాబాద్లో ఆధునిక వినోదానికి కొత్త కేంద్రంగా F3 గేమింగ్ జోన్ తేదీ: 25 ఉదయం 10:00 గంటలకు ప్రారంభించబడింది. ఈ గేమింగ్ జోన్ KPHB మెట్రో స్టేషన్ సమీపంలోని పీఎన్ఆర్ ఎంపైర్లో స్థాపించబడింది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ అతిథులు హాజరయ్యారు:

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే శ్రీ ఆరికేపూడి గాంధీ గారు,

కూకట్పల్లి ఎమ్మెల్యే శ్రీ మాధవరం కృష్ణారావు గారు, మరియు

సినీ నటులు హిషిత రెడ్డి, సాగర్ శైలేష్ గారు ఈ వేదికను అధికారికంగా ప్రారంభించారు.

F3 గేమింగ్ జోన్ ముఖ్య విశేషాలు:

పిల్లలు మరియు యువత కోసం విభిన్న ఆధునిక గేమ్స్



సందర్శకుల కోసం ప్రత్యేక ఫుడ్ కోర్ట్

6 నుంచి 7 ప్రత్యేక డైనింగ్ హాల్స్ అందుబాటులో ఉన్నాయి

మహిళల కోసం ప్రత్యేక బ్యూటీ & ఫ్యాషన్ బుటిక్స్

పటాన్చెరువు నుంచి అబిడ్స్ వరకు ఈ ప్రాంతంలోనే అతిపెద్ద గేమింగ్ జోన్ గా ఇది నిలవనుంది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రీమియం వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రం ఏర్పాటైంది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై కవరేజ్ ఇచ్చిన అన్ని మీడియా ప్రతినిధులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

స్థలం: పీఎన్ఆర్ ఎంపైర్, KPHB మెట్రో స్టేషన్ సమీపంలో, హైదరాబాద్

తేదీ & సమయం: 25వ తేదీ ఉదయం 10:00 గంటలకు

ధన్యవాదాలు,

శ్రీ బొల్ల రామకృష్ణ

(F3 గేమింగ్ జోన్ వ్యవస్థాపకుడు)

# మేడ్చల్ కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభించిన కలెక్టర్,జడ్జి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మార్చి 24:**కుషాయిగూడలో గల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు లో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ను బుధవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి.బాల భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జడ్జి గవర్నమెంట్ ప్లీడర్ కె. రాంచందర్ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి అమరావతి, నాల్గవ ఎడిజె డి.కిరణ్ కుమార్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జెసిజె ప్రశాంతి, మూడవ జెసిజె సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఎజిపి సునితారాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్,యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య

**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులు,మురుగు కాలువ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.గ్రామంలోని నర్సరీని సందర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని,సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని,విద్యార్థుల ఆరోగ్యం శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం ఆసుపత్రిని సందర్శించి సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రామ్మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్,మండల పంచాయతీ అధికారి జలంధర్,గృహ నిర్మాణ శాఖ ఎ.ఈ.లయకత్ అలీ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎ.ఈ. నందన్ వర్మ,పంచాయతీ కార్యదర్శి రాహుల్, ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి.... ఎస్.టి.యు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హనుమంత రెడ్డి....




అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్జునయ్య పదవి విరమణ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్.టి.యు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ మురళి,కొత్త శ్రీధర్ రావులతో కలిసి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వడ్డే హనుమంత రెడ్డి మాట్లాడినారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించవలసిన జిపిఎఫ్, ఆరోగ్య బీమా,మెడికల్ బిల్లులను సంవత్సరాలుగా ఆపడం ప్రభుత్వానికి మంచిది కాదని వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని అన్నారు.రెండవ పి.ఆర్.సిని ప్రకటించి అమలు చేయాలని, పర్యవేక్షక పోస్టులైన ఎంఈఓ,డిప్యూటీ డీఈవో,డైట్ లెక్చరర్ ఖాళీలను భర్తీ చేయాలని వారు అన్నారు.

ఈ సన్మాన కార్యక్రమంలో అచ్చంపేట మండల అధ్యక్ష కార్యదర్శులు నారాయణ గౌడ్,భాస్కర్, వివిధ మండలాల నాయకులు చంద్రశేఖర్, విష్ణు,నరేందర్ రెడ్డి, ప్రవీణ్,శ్రీకాంత్, రాజు, కృష్ణయ్య,శ్రీనివాస్, ఈశ్వర్,బ్రహ్మేంద్ర యాదవ్,సృజన,కవిత, మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు పోకల సతీష్,రవి శేఖర్,కొంగరీ రమేష్ ప్రభాకర్,ఏం. సుదర్శన్,విద్యాసాగర్ సత్యనారాయణ, కాశన్న తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆగని ఉచితాల హామీలు

## (సి.హెచ్.ప్రతాప్)

ఇటీవలి నాలుగు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో రాజకీయ పక్షాల మధ్య పోటీ మరింత తీవ్రంగా మారింది. ఈ పోటీలో ప్రధాన ఆయుధంగా మారింది "ఉచితాల హామీలు". విద్యుత్ ఉచితం, నగదు బదిలీలు, ఉచిత వస్తువులు, రాయితీలు---ఇలాంటి వాగ్దానాలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఈ విధానం తక్షణ ఫలితాలను ఇవ్వవచ్చు; కానీ దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై పడే భారం గురించి చాలా సందర్భాల్లో పట్టించుకోడం లేదు.ఉచితాల విధానం సామాజిక సంక్షేమానికి కొంతవరకు అవసరం. పేదలు, వెనుకబడిన వర్గాలకు సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే, ఇది పరిమితిని దాటితే ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరంగా మారుతుంది. ఎన్నికల సమయంలో అనవసరంగా పెద్ద మొత్తంలో ఉచితాలను హామీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారీ ఒత్తిడి పడుతుంది. ఈ భారం చివరికి పన్నుల రూపంలో లేదా అప్పుల రూపంలో ప్రజలపైనే పడుతుంది.

ఉచితాల వల్ల మరో ముఖ్యమైన సమస్య ఆర్థిక క్రమశిక్షణ కోల్పోవడం. ప్రభుత్వాలు ఆదాయం కంటే ఖర్చులు పెంచుకుంటే, అప్పులు పెరుగుతాయి. దీని వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు తగ్గిపోతాయి. మౌలిక వసతులు, విద్య, ఆరోగ్య రంగాలకు కేటాయింపులు తగ్గే ప్రమాదం ఉంది. దీర్ఘకాలిక అభివృద్ధి బలహీనపడుతుంది.

సమాజంపై కూడా ఉచితాల ప్రభావం ఉంటుంది. నిరంతరం ఉచితాలపై ఆధారపడే సంస్కృతి పెరిగితే, స్వయం సమర్థత తగ్గిపోతుంది. కష్టపడి సంపాదించాలనే భావన మందగిస్తుంది. యువతలో ఉద్యోగాల కోసం కృషి చేయడం కన్నా, ప్రభుత్వ సహాయాలపై ఆధారపడే ధోరణి పెరిగే అవకాశం ఉంది. ఇది సమాజంలో ఉత్పాదకతను తగ్గిస్తుంది.

ఇంకో ప్రధాన సమస్య రాజకీయ పోటీ మరింత అసమానంగా మారడం. ఒక పార్టీ ఎక్కువ ఉచితాలు ప్రకటిస్తే, ఇతర పార్టీలు కూడా పోటీగా మరింత భారీ హామీలు ఇవ్వాల్సి వస్తుంది. ఈ పోటీ చివరికి బాధ్యతలేని హామీలకు దారితీస్తుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో నాణ్యత తగ్గిపోతుంది.

ఈ పరిస్థితిని నియంత్రించడానికి కొన్ని చర్యలు అవసరం. ఎన్నికల సమయంలో ప్రకటించే హామీలపై ఆర్థిక సమీక్ష ఉండాలి. వాటి అమలుకు అవసరమైన నిధులపై స్పష్టత ఉండాలి. బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతి పెంపొందించాలి. ప్రజలు కూడా తక్షణ లాభాలకన్నా దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి.

ఉచితాలు పూర్తిగా తప్పు కాదు; కానీ అవి లక్ష్యితంగా, అవసరమైన వారికి మాత్రమే పరిమితం కావాలి. సమతుల్య విధానాలు పాటించకుండా ఉచితాల పోటీ కొనసాగితే, ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉండాలంటే బాధ్యతాయుతమైన హామీలు, పారదర్శకమైన అమలు అత్యవసరం.

# కమర్షియల్ గ్యాస్ లేక మూతపడ్డ హోటల్స్




**మలుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మార్చి 25** ఏటూరు నాగారం మండలంలో. కమర్షియల్ గ్యాస్ లు అందుబాటులో లేక మూతపడ్డ టిఫిన్ సెంటర్స్ ముఖ్యంగా ప్రయాణికులు బస్టాండ్ లో ఏర్పాటు చేసిన క్యాంటీన్ వద్ద టిఫిన్ భోజనం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు నిరాశ చెందారు అలాగే చిన్న చిన్న హోటల్స్ టిఫిన్ సెంటర్లు గ్యాస్ లేకపోవడంతో ప్రతిరోజు చిట్టి డబ్బులు కట్టాలన్న హోటల్స్ లో పనిచేసే వారికి వేతనాలు ఇవ్వాలన్న హోటల్ నిర్వాహకులు చాలా ఇబ్బందులకు పడుతున్నారు ప్రభుత్వాన్ని వెంటనే కమర్షియల్ గ్యాస్ లు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు

# మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని మహిళా సమాఖ్యల కొరకు చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు

హైదరాబాద్ నగరంలోని మెహదీపట్నం, రేతి బౌలి, లంగర్ హౌస్ ప్రాంతాల్లో ఇంధన కొరత పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చాలా పెట్రోల్ బంకుల వద్ద "నో స్టాక్" బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల మాత్రం పరిమితంగా ఇంధనం అందుబాటులో ఉండటంతో తెరిచి ఉన్న పెట్రోల్ పంపుల వద్ద భారీగా వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఇంధనం కోసం వాహనదారులు పొడవైన క్యూలలో నిలబడాల్సి వస్తుండటంతో సమయం వృథా కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాలు, అత్యవసర పనుల కోసం బయలుదేరిన వారు ఈ పరిస్థితితో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన కొరతకు గల కారణాలపై అధికారుల నుంచి స్పష్టత రాకపోవడంతో ప్రజల్లో అనిశ్చితి నెలకొంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు వెంటనే చర్యలు తీసుకుని సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు

# శ్రీ చైతన్య కళాశాలలో ఘనంగా శ్రీ చైతన్యోత్సవ్--2026










**ఖమ్మం ప్రతినిధి మార్చి 25 (ప్రజాబలం)** ఖమ్మం జిల్లా స్థానిక పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లో శ్రీ చైతన్యోత్సవ్--2026 కార్యక్రమం కలర్స్ ఆఫ్ ఇన్నోవేషన్ -- కలర్స్ ఆఫ్ సెలబ్రేషన్ అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన కలర్స్ ఆఫ్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో జేఎన్‌టీయూ డైరెక్టర్ శ్రీ వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను అభినందించారు. విద్యార్థుల చదువులో రీసెర్చ్ అనేది కీలక భాగమని, దేశ విదేశాల్లో విద్యార్థులు సామాజిక స్పృహతో పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. శ్రీ చైతన్య విద్యార్థులు కూడా సమాజానికి అవసరమైన అంశాలపై పరిశోధనలు చేయాలని, దానిని తమ బాధ్యతగా భావించాలని సూచించారు.

ఈ ఉత్సవంలో భాగంగా నిర్వహించిన సామాజిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్లడ్ డొనేషన్ అనాథాశ్రమాల సందర్శన వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. మెకానికల్ విభాగం విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ కార్ ఈసీఈ విద్యార్థుల రాడార్ ప్రాజెక్ట్ ఎలక్ట్రికల్ విద్యార్థుల సోలార్ ప్రాజెక్ట్స్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు కళాశాల చైర్మన్ శ్రీ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై శ్రద్ధతో పాటు సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు నూతన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు బీటెక్ ఎంబీఏ డిప్లొమా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోస్టర్ ప్రెజెంటేషన్ క్విజ్ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యంగా డిప్లొమా విద్యార్థులకు ప్రేరణనిస్తాయని అన్నారు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి గీతిక మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం సాధించడానికి అవసరమైన మెలకువలను వివరించారు డైరెక్టర్ శ్రీమతి విద్య మాట్లాడుతూ ఉత్సవంలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించి, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందన్నారు రేపు నిర్వహించే కలర్స్ ఆఫ్ సెలబ్రేషన్ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు హేమచందర్ తన బృందంతో లైవ్ మ్యూజిక్ ప్రదర్శన ఇస్తారని తెలిపారు డైరెక్టర్ డా. రావు తేజ్ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి పుస్తక పఠనం యోగ వంటి మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు కళాశాల ప్రిన్సిపాల్ డా. లక్ష్మీనారాయణ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి ఆచరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. సుదర్శన్ ఏఓ వైశాలి ట్రైనింగ్ మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్ రాజేష్ డిప్లొమా ఇంచార్జ్ కృష్ణప్రసాద్, విభాగాధిపతులు డా. జ్యోతి, డా. ప్రణతి డా. చార్యులు శ్రీకుమార్ తదితరులు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మహిళల సంక్షేమం,ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని మహిళా సమాఖ్యల కొరకు చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** మంచిర్యాల నియోజకవర్గ ప్రతినిధి : చెరువుకు చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పెద్దపేటలో జరిగింది. పెద్దపేట గ్రామానికి చెందిన నర్మల లింగయ్య(64) ఇవాళ ఉదయం తోటి మత్స్య కారులతో కలిసి అదే గ్రామంలోని ఎర్రకుంట చెరువుకు చెపల వేటకు వెళ్ళాడు. చేపలు పట్టే క్రమంలో చెరువులోకి వల విసిరి వెనుకకు లాగుతుండగా చెరువు నీటిలో ముందుకు పడిపోయాడు. ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయాడు, ఈ విషయం మృతి భార్య ఫిర్యాదు మేరకు దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దిగివచ్చిన మొక్క జొన్న రాశి సీడ్ కంపెనీ..
## రైతులతో ఎకరాకు 80,000/-రూ నష్టపరిహారం ఒప్పందం!



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మార్చి 25** ఇతర విత్తన కంపెనీలు కూడా నష్టపరిహారం చెల్లించాలని తుడుం దెబ్బ డిమాండ్

ఏటూరునాగారం: అల్లం వారి గణపురం నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న రైతుల పక్షాన తుడుందెబ్బ సాగించిన పోరాటం ఫలించింది. తుడుందెబ్బ నాయకత్వంలో జరిగిన తీవ్ర ఒత్తిడికి రాశి సీడ్స్ కంపెనీ ఎట్టకేలకు దిగివచ్చింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు ?80,000 చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు కంపెనీ ప్రతినిధులు రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఈ వివాదంపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు ఏఓ (ఇూా) వేణుగోపాల్, ఏఈఓ (ూజుూ) రాజు కుమార్ గారు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరీక్షించి, నష్టం జరిగిన తీరును అంచనా వేశారు. అధికారుల నివేదిక మరియు తుడుందెబ్బ నాయకుల పోరాట ఫలితంగానే కంపెనీ యాజమాన్యం పరిహారం చెల్లింపునకు ముందుకు వచ్చింది.



ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకత్వం మాట్లాడుతూ.. "ఈ విజయం కేవలం ఒక కంపెనీకి మాత్రమే పరిమితం కాదు. ఏటూరునాగారం మండలంలో రాశి సీడ్స్‌తో పాటు ఇతర కంపెనీల విత్తనాలు వాడి నష్టపోయిన రైతులందరికీ కూడా తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి" అని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని విత్తన కంపెనీల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

అన్నదాతల హక్కుల కోసం, గిరిజన రైతుల సంక్షేమం కోసం తుడుందెబ్బ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఈ సందర్భంగా తెలియజేయడమైనది.

## షెడ్యూల్డ్ కులములు,షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 25 :** జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి.అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్,డి.సి.పి.ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు,బెల్లంపల్లి సబ్-కలెక్టర్ మనోజ్,మంచిర్యాల, బెల్లంపల్లి,జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్,కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు,షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ,సంబంధిత శాఖల అధికారులు,ఎస్.సి.,ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు,పరిష్కారం,బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో నెలకొన్న ఎస్.సి.,ఎస్.టి.సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్.సి.,ఎస్.టి.అభివృద్ధి, కేసులు, ఎన్ ఫోర్స్ మెంటు అమలు అంశాలపై తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి.,ఎస్.టి.లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇండ్లు నిర్మించుకోలేని వారికి గుత్తేదారుల సమన్వయంతో ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రగతికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లిలోని పి వి టి జి,తాండూర్ లో ఎస్.టి. వసతి గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో అందరికీ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2023 డిసెంబర్ వరకు నమోదైన కేసులలో బాధితులకు గత సంవత్సరం 1 కోటి 34 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పౌర హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి,నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్య బోధన అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పారిశుధ్యం,త్రాగునీరు ఇతర ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ...అట్రాసిటీ కేసుల నియంత్రణపై ఎస్.సి.,ఎస్.టి. లకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను గ్రామపంచాయతీలలో నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులపై అవగాహన కలుగుతుందని తెలిపారు. 2025 సంవత్సరములో 117 అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయని, కేసుల పరిష్కారంలో సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, సరైన ఆధారాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.,ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ,చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి,ఎ.టి.డి.ఓ. సురేష్,కలెక్టరేట్ బి విభాగం పర్యవేక్షకులు మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు శాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## షర్మిల నిరసన

కడప అరటి రైతుల పక్షాన కడపలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి వినూత్న ప్రదర్శన నిర్వహించారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అరటి గెలలు లోడ్ చేసిన వాహనాన్ని స్వయంగా నడుపుకుంటూ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అరటి గెలలతో జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com